ANN తెలుగు

Follow: @ANNTELUGU

27-10-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 260 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా

- తెలంగాణలో రికార్డు సృష్టిస్తున్న 'మహాలక్ష్మి' పథకం!
- నిత్యం 35 లక్షల మందికి పైగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి
- టీజీఎస్ఆర్టీసి వెల్లడి
- ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం మరో అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. రాష్ట్రంలోని మహిళలకు రవాణా భారాన్ని పూర్తిగా తగ్గించి, వారిని ఆర్థికంగా ఆదుకుంటున్న ఈ పథకం ద్వారా ఇప్పటివరకు ఏకంగా రూ. 10,000 కోట్లకు పైగా నిధులు ఆదా అయినట్లు టీజీఎస్ఆర్టీసి అధికారికంగా వెల్లడించింది. పథకం ప్రారంభమైన

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ గాంధీ భరోసా



- మోదీతో ఆ ఒక్క పనిచేయించండి
- అలా చేస్తే 30 సెకన్లలో ర్యాలీపై నిర్ణయం

03

### హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర



- కాంగ్రెస్ ఢిల్లీ ర్యాలీ మరుసటిరోజే కౌంటర్

02

### కోలీవుడ్ స్టార్ ధనుశ్ కాంట్రవర్సీ



- కమలంముద్రతో ఉన్న వెండిదీపాల పంపిణీ
- మహిళా అభిమానులకు దీపావళి కానుకపై రాజకీయ విమర్శలు

02



## రేవంత్ దౌత్యవ్యూహం సక్సెస్

### తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం

- 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణకు సహకరించేందుకు ఎలాంటి అభ్యంతరంలేదన్న ఫడ్నవిస్
- రెండురాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- ఈ చర్చలు చారిత్రాత్మకమన్న సీఎం రేవంత్ రెడ్డి
- ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు వరప్రదాయిని



**ముంబై, మహా :** తెలంగాణ నీటిపారుదల రంగంలో మరో కీలక అడుగుపడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ పట్టుదలతో మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ చర్చలకు అంగీకరించడంతో పాటు ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది.

మిగతా 2వ పేజీలో

## మెట్రో ఫేజ్-2కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్




### హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

ఫేజ్-2




- గేమ్ ఛేంజర్ గా మారనున్న ఫేజ్ -2
- ఐదు కారిడార్లు.. 76కిమీలు.. హయత్ నగర్ టు పటాన్ చెరు మెట్రో
- రూ.24,269 కోట్లతో 2029 నాటికి పూర్తిచేసేలా ప్లాన్

| ఫేజ్-2లోని ఐదు ప్రధాన కారిడార్లు.. |
| --- |
| కారిడార్ 1 (నాగోల్ - ఎయిర్‌పోర్ట్): 36.8 కిలోమీటర్లు. |
| కారిడార్ 2 (రాయదుర్గం - కోకాపేట): 11.6 కిలోమీటర్లు. |
| కారిడార్ 3 (ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట): 7.5 కిలోమీటర్లు (పాతబస్తీ లైన్). |
| కారిడార్ 4 (మియాపూర్ - పటాన్‌చెరు): 13.4 కిలోమీటర్లు. |
| కారిడార్ 5 (ఎల్బీనగర్ - హయత్ నగర్): 7.1 కిలోమీటర్లు. |
| ఈ ఐదు కారిడార్లు అందుబాటులోకి వస్తే నగరంలోని ప్రధాన సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఐటీ కారిడార్, పాతబస్తీ, ఔటర్ వైపు వెళ్లే ప్రయాణీకులకు ట్రాఫిక్ తిప్పలు తప్పి, వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది |

**హైదరాబాద్, మహా** : హైదరాబాద్ గేమ్ ఛేంజర్ ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2 విస్తరణ ప్రతిపాదనలకు కేంద్రం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త కారిడార్లలో ఈ నిర్మాణ పనులను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెట్రో ఫేజ్ 2 పనులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే నాగోల్‌ఎయిర్‌పోర్ట్ (ఎయిర్‌పోర్ట్ కారిడార్) మార్గంతో ముందుగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.



### 'ఆదర్శ కుటుంబం' సినిమా కోసం యూనివర్సిటీకి సెలవా?

**ప్రీతిరెడ్డిపై విద్యార్థిసంఘాల ఆగ్రహం**

**హైదరాబాద్, మహా :** సినిమా ప్రమోషన్ల కోసం విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి యూనివర్సిటీ, విద్యాసంస్థల యాజమాన్యంపై విద్యార్థి, యువజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విక్టరీ వెంకటేశ్ నటించిన 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల సందర్భంగా అక్టోబర్ 30న బహిరంగంగా కళాశాల యాజమాన్యం తరుపున సెలవుప్రకటించడంఆరుణమని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. అక్టోబర్ 23న యూనివర్సిటీలో సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారని, సినిమా విడుదల రోజున విద్యార్థులు వీక్షించేందుకు సెలవు ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. విద్యాప్రమాణాల

మిగతా 2వ పేజీలో

## యాదాద్రి విద్యుత్ కేంద్రానికి ఊరట

- డఒడిశా నుంచి బొగ్గు రవాణాకు గ్రీన్ సిగ్నల్!
- బొగ్గు రవాణా సమయాన్ని 4 గంటల నుంచి 6 గంటలకు పెంచిన యంత్రాంగం.
- రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు తరలింపునకు వెసులుబాటు.

02





### తమిళనాడు రాజకీయాల్లో సంచలనం

- ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలు చెల్లుబాటేనన్న సుప్రీం
- ఫిరాయింపులు, రాజీనామాలు రాజకీయ ప్రక్రియలో భాగమేనని స్పష్టం

02

### పేదల ఆరోగ్యానికి పల్లా భరోసా

- రోగులను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే
- పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యం

04






### రఘురామకృష్ణంరాజుకు సుప్రీం షాక్

**రూ.237 కోట్ల బ్యాంకు మోసం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ కొట్టివేసేందుకు నిరాకరణ**

**మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**అమరావతి, మహా :** టీడీపీ నేత, ఉండి శాసన సభ్యుడు కనుమూరు రఘురామకృష్ణంరాజుకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊహించని రీతిలో భారీ షాక్ తగిలింది. రూ.237 కోట్ల మేర బ్యాంకులను మోసం చేసి, ప్రభుత్వ నిధులను పెద్దఎత్తున పక్కదారి పట్టించిన కుంభకోణానికి సంబంధించి తనపై నమోదైన సీబీఐ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ (క్వాష్ పిటిషన్) ఆయన చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆర్థిక అక్రమాలు, బ్యాంకుల నిధుల దోపిడీకి సంబంధించిన ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

**కేసు నేపథ్యం మరియు ఆరోపణలు:**

ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ (ఏ1) పేరుతో పవర్ ప్లాంట్ల ఏర్పాటు మరియు ఇతర వ్యాపార అవసరాల నిమిత్తం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) నేతృత్వంలోని బ్యాంకు కన్సార్షియం నుంచి రఘురామకృష్ణంరాజు రూ.237.84 కోట్లను భారీ

మిగతా 2వ పేజీలో

# మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా

( మొదటి పేజీ తరువాయి )

నాటి నుంచి సుమారు 28 నెలల కాలంలోనే ఏకంగా 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదవడం ఈ పథకం విజయానికి నిదర్శనంగా నిలిచింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ మహాలక్ష్మి సౌకర్యాన్ని వినియోగించుకుంటూతమ దైనందిన పనుల నిమిత్తం సులభంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పథకం ప్రభావంతో టీజీఎస్ఆర్టీసి బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా గతంలో ఉన్న 40 శాతం నుంచి ఏకంగా 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందన కారణంగా ఆర్టీసి మొత్తం ఆక్యుపెన్సీ రేటు 69 శాతం నుంచి ఏకంగా 98 శాతానికి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చిన కేవలం 48 గంటల్లోనే ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకానికి శ్రీకారం చుట్టామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ చారిత్రాత్మక విజయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాదని, అది రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు మరియు స్వావలంబనకు అసలుసలైన ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై పడుతున్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, దీనివల్ల వారు విద్య, ఉపాధి , ఇతర వ్యక్తిగత అవసరాల కోసం ఎవరిపై ఆధారపడకుండా స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. మహిళల నుంచి పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరిన్ని కొత్త బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు టీజీఎస్ఆర్టీసి తగిన చర్యలు తీసుకుంటోందని సీఎం స్పష్టం చేశారు.

# యాదాద్రి విద్యుత్ కేంద్రానికి ఊరట

- **ఒడిశా నుంచి బొగ్గు రవాణాకు గ్రీన్ సిగ్నల్!**
- **బొగ్గు రవాణా సమయాన్ని 4 గంటల నుంచి 6 గంటలకు పెంచిన యంత్రాంగం.**
- **రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు తరలింపునకు వెసులుబాటు.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో విద్యుదుత్పత్తికి అత్యంత కీలకమైన, ప్రతిష్టాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరాను మెరుగుపరిచే దిశగా ఒక అడుగు ముందుకు పడింది. ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లా పరిధిలో బొగ్గు రవాణాకు ఎదురవతున్న సమయ పరిమితులను సడలిస్తూ, రవాణా సమయాన్ని నాలుగు గంటల నుంచి ఆరు గంటలకు పెంచేందుకు జిల్లా యంత్రాంగం అంగీకరించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బొగ్గు తరలింపునకు ప్రత్యేక వెసులుబాటు లభించడంతో.. నైనీ బొగ్గు గని నుంచి సరఫరాను గణనీయంగా పెంచేందుకు సరికొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే బొగ్గు నిల్వలు, నాణ్యత, రవాణా సామర్థ్యం వంటి కీలక అంశాలపై తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు తీవ్ర కసరత్తు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**బొగ్గు ఉంది.. కానీ రవాణాకే అసలు అడ్డంకి!**

ఒడిశాలోని నైనీ బొగ్గు గనిలో దాదాపు 20 లక్షల టన్నుల బొగ్గు త్రవ్వకాలకు, తరలింపునకు పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పటికీ.. రవాణా పరిమితుల కారణంగా దాన్ని పూర్తిస్థాయిలో బయటకు తీసుకురాలేకపోతున్న పరిస్థితి నెలకొంది. స్థానిక గ్రామాల గుండా భారీ వాహనాలు ప్రయాణించాల్సి రావడం, రవాణా సమయాలపై కఠినమైన ఆంక్షలు ఉండటం వల్ల అందుబాటులో ఉన్న బొగ్గును వేగంగా తరలించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రవాణాకు అనుమతించే సమయాన్నినాలుగు గంటల నుంచి ఆరు గంటలకు పెంచాలని అంగుల్ జిల్లా యంత్రాంగం నిర్ణయించడం సరఫరా గొలుసులోని ప్రధాన అడ్డంకిని తొలగించడానికి దోహదపడనుంది.

**రాత్రివేళ రవాణాతో ప్రత్యేక వెసులుబాటు.**

తాజా నిర్ణయం ప్రకారం రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు బొగ్గు రవాణాకు అనుమతి లభించినట్లు తెలుస్తోంది. రాత్రి వేళల్లో ఈ రవాణా నిర్వహించడం ద్వారా పగటిపూట స్థానిక ప్రజలకు, సాధారణ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడవచ్చు. అదే సమయంలో గని నుంచి రైల్వే లోడింగ్ కేంద్రాల వరకు వాహనాల రాకపోకలను మరింత క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుంది. అయితే ఈ సమయానికి సంబంధించిన అనుమతులు, ఏయే మార్గాలకు వర్తిస్తాయనే దానిపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

**యాదాద్రి విద్యుత్ కేంద్రం అవసరాలు భారీగా.**

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో రూపుదిద్దుకున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం ఏకంగా 4,000 మెగావాట్లు. ఐదు యూనిట్లతో కూడిన ఈ బృహత్తర ప్రాజెక్టు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి రంగంలో అత్యంత కీలకం కానుంది. అయితే ఈ కేంద్రం తన నిర్దేశిత సామర్థ్యానికి అనుగుణంగా నిరంతరం పనిచేయాలంటే భారీ స్థాయిలో నాణ్యమైన బొగ్గు అవసరం. సింగరేణిలో అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి పరిమితంగా ఉండటంతో, ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఒడిశాలోని నైనీ గనిపై ప్రధానంగా దృష్టి సారించింది.

**బొగ్గు నిల్వలు - ప్రత్యామ్నాయ సరఫరాపై కసరత్తు.**

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు మరియు వినియోగం మధ్య సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా సింగరేణి మరియు తెలంగాణ జెన్‌కో సంయుక్తంగా రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలకు రోజువారీగా భారీ ఎత్తున బొగ్గు చేరేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. యాదాద్రి కేంద్రానికి నైనీ గని నుంచి రైల్వే మార్గంలో బొగ్గు సరఫరాను వేగవంతం చేయడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి.

**దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి.**

తాత్కాలిక సడలింపులతో పాటు భవిష్యత్తులో రవాణా సామర్థ్యాన్ని శాశ్వతంగా పెంచే మౌలిక వసతులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. నైనీ గని నుంచి రైల్వే మార్గానికి అనుసంధానం కల్పించే ప్రతిపాదిత రైల్వే కారిడార్ పనులు పూర్తయితే, బొగ్గు తరలింపును కేవలం రాత్రివేళలపైనే కాకుండా పెద్ద ఎత్తున నిరంతరంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. అలాగే పరిమాణంతో పాటు విద్యుత్ కేంద్రానికి అవసరమైన జీ9 గ్రేడ్ నాణ్యతా ప్రమాణాలు కలిగిన బొగ్గును సమీకరించే దిశగా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.

# తమిళనాడు రాజకీయాల్లో సంచలనం

- **ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలు చెల్లుబాటేనన్న సుప్రీం**
- **ఫిరాయింపులు, రాజీనామాలు రాజకీయ ప్రక్రియలో భాగమేనని స్పష్టం**



**ఢిల్లీ, మహా :** తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా మరియు పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. రాజీనామా చేసి వేరే పార్టీలో చేరడం, మంత్రి పీఠం అధిష్టించడం అనేది సాధారణ రాజకీయ ప్రక్రియలో ఒక భాగమేనని స్పష్టం చేస్తూ, దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. ఈ తీర్పుతో తమిళనాట విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం ప్రభుత్వానికి మరింత బలం చేకూరినట్లయింది. ఢిల్లీలో సోమవారం జరిగిన విచారణలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. తమిళ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన విశ్వాస పరీక్షలో అన్నాడీఎంకే విప్‌ను ధిక్కరించి ఆరుగురు ఎమ్మెల్యేలు అధికార పక్షానికి అనుకూలంగా ఓటు వేశారు. ఆ వెంటనే వారు తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేసి అధికారికంగా టీవీకేలో చేరారు. ఈ విధంగా ఫిరాయించిన వారిలో పెరుందురై నుంచి ఎస్. జయకుమార్, మదురాంతకం నుంచి మరగతం కుమారవేల్, ధారాపురం నుంచి పి. సత్యభామ, అంబసముద్రం నుంచి ఎసక్కి సుబయ్యతో పాటు సి. విజయభాస్కర్, ఎం.ఆర్. విజయభాస్కర్ ఉన్నారు.

**మద్రాస్ హైకోర్టు తీర్పు సమర్థన:**

ఈ ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది కె. సుతన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఒక ఎమ్మెల్యే స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఉప ఎన్నికకు కారణమైతే, ఆ ఉప ఎన్నికకు అయ్యే ప్రజాధనాన్ని ముందుగా ఆయా అభ్యర్థులే డిపాజిట్ చేయాలనే 'ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ సెక్యూరిటీ' విధానాన్ని తీసుకురావాలని, అలాగే ఫిరాయించిన వారిపై ఐదేళ్లపాటు అనర్హత వేటు వేయాలని ఆయన పిటిషన్‌లో కోరారు. అయితే, ఈ పిటిషన్‌ను సెప్టెంబర్ 24న హైకోర్టు కొట్టివేసింది. శాసనసభ స్థానానికి రాజీనామా చేసే హక్కు రాజ్యాంగ పథకంలో అంతర్భాగమని, న్యాయస్థాన ఉత్తర్వుల ద్వారా దానిపై చట్టానికి మించిన షరతులు విధించలేమని స్పష్టం చేసిన హైకోర్టు.. అక్టోబర్ 13న స్పీకర్ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థిస్తూ తుది తీర్పు వెలువరించింది.

**సుప్రీంకోర్టులో చుక్కెదురు:**

మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. పదవ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి కొందరు ఈ రాజీనామా మార్గాన్ని వాడుకుంటున్నారని, ఇందులో గుర్రపు బేరాలు జరిగాయని, దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఎవరైనా రాజీనామా చేసి మంత్రి కావడం అనేది రాజకీయ ప్రక్రియలో భాగమేనని వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్‌కు సంబంధించి చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పిటిషన్‌ను తోసిపుచ్చడంతో తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఈ తీర్పు తీవ్ర చర్చనీయాంశమైంది.

# రేవంత్ దౌత్యవ్యూహం సక్సెస్

( మొదటి పేజీ తరువాయి )




రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

**సానుకూలంగా ఫడ్నవిస్**

తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ ధృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడ్నవిస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి**

రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు.

ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు.

**152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట**

ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

తెలంగాణమహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

**గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు**

దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడ్నవిస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

**తెలంగాణతో సోదరబంధం**

మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడ్నవిస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి**

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# కోలీవుడ్ స్టార్ ధనుశ్ కాంట్రవర్సీ

- **కమలంముద్రతో ఉన్న వెండిదీపాల పంపిణీ**
- **మహిళా అభిమానులకు దీపావళి కానుకపై రాజకీయ విమర్శలు**



**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయ తెరపై కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్ ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం చేయబోతున్నారనే ఊహాగానాలు జోరుగా సాగుతున్న తరుణంలో, తాజాగా ఆయన మహిళా అభిమానులకు బహుమతిగా ఇచ్చిన వెండి దీపాలపై ఉన్న 'కమలం' గుర్తు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. భారతీయ జనతా పార్టీ ఎన్నికల గుర్తు కూడా కమలం కావడంతో, ఈ పరిణామం కొత్త రాజకీయ సమీకరణాలకు సంకేతమా అనే కోణంలో జోరుగా చర్చ సాగుతోంది. చెన్నై ఓఎంఆర్ రోడ్డులోని సెమ్మంజేరిలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో ధనుశ్ తన అభిమాన సంఘం "ధనుశ్ నర్పణి ఇయక్కం" మహిళా విభాగం సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తమిళనాడు వ్యాప్తంగా సుమారు 3,000 మందికి పైగా మహిళా అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారందరికీ దీపావళి కానుకగా సాంప్రదాయ వెండి కామాక్షి దీపాలను ఆయన బహూకరించారు. అయితే, ఆ దీపాల అడుగుభాగంలో కమలం పువ్వు మోటిఫ్ ముద్రించి ఉండటం ఒక్కసారిగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై ధనుశ్ నర్పణి ఇయక్కం ప్రతినిధులు వెంటనే స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. దీపంపై ఉన్న కమలం గుర్తు కేవలం దానిని తయారు చేసిన తయారీదారుడికి (మ్యానుఫ్యాక్చరర్) సంబంధించిన స్టాంప్ లేదా లోగో మాత్రమేనని, దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అయినప్పటికీ, ఈ వివరణతో రాజకీయ విమర్శలు పూర్తిగా శాంతించలేదు. ఇటీవల కాలంలో ధనుశ్ తన ఫ్యాన్ క్లబ్‌ను ఒక సేవా ఉద్యమంగా పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. దీనికి తోడు ఆయన భవిష్యత్తులో 'తమిళగ ఎళుచ్చి కజగం' పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నారంటూ కొంత కాలంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తాజా సమావేశంలో కమలం గుర్తు ఉన్న దీపాలను బహూకరించడం ఈ వదంతులకు మరింత ఆజ్యం పోసినట్లయింది. ఈ రాజకీయ ఊహాగానాలపై మీడియా ప్రతినిధులు ధనుశ్ ను ప్రశ్నించగా, ఆయన నేరుగా ఎలాంటి రాజకీయ సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. సమావేశానికి వచ్చిన వారందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపి, "చాలా సంతోషంగా ఉంది" అని మాత్రమే సంక్షిప్తంగా చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాజకీయ ప్రవేశంపై ఆయన నేరుగా స్పందించకుండా మౌనం పాటించడం తమిళనాట మరింత ఆసక్తిని, ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

# 'ఆదర్శ కుటుంబం' సినిమా కోసం యూనివర్సిటీకి సెలవా?

( మొదటి పేజీ తరువాయి )



పెంపుపై దృష్టి పెట్టాల్సిన విద్యాసంస్థలు సినిమా ఈవెంట్లకు ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని, యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, విద్యార్థులు చదువుకోవడానికి కళాశాలలకు వస్తారని, సినిమా ప్రచారానికి ప్రేక్షకులుగా మారడానికి కాదని ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర పేర్కొన్నారు. సెలవు నిర్ణయం, విద్యా క్యాలెండర్‌పై ప్రభావం, విద్యార్థులపై ఏదైనా ఒత్తిడి ఉందా అనే అంశాలపై ఉన్నత విద్యాశాఖ, సంబంధిత నియంత్రణ సంస్థలు విచారణ జరపాలని కోరారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ గాంధీ భరోసా

**న్యూఢిల్లీ, మహా :** నవంబర్ 1వ తేదీన ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఇండియా' కూటమి తలపెట్టిన 'సేవ్ ఓట్స్ సేవ్ ద నేషన్' భారీ ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీ వ్యాపార వర్గాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టమైన వైఖరిని ప్రకటించారు. పండుగల సీజన్ కావడంతో వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్న ఢిల్లీ వ్యాపారులకు ఆయన పూర్తి భరోసా కల్పిస్తూనే, అసలు రాజధానిలో ఈ లాక్‌డౌన్ పరిస్థితులకు, ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నిందితుడు నంబర్ 4 అయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగిస్తే, కేవలం 30 సెకన్లలో ఈ నిరసనలన్నీ పూర్తిగా ఆగిపోతాయని ఆయన సంచలన వ్యాఖ్య చేశారు.

వ్యాపారుల ఆందోళనపై రాహుల్ గాంధీ స్పందన జాతీయ రాజధానిలో నవంబర్ 1న తలపెట్టిన భారీ ర్యాలీపై ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీకి లేఖ రాస్తూ కీలక అభ్యర్థన చేశారు. ధన్‌తేరాస్, దీపావళి, భాయ్ దూజ్ వంటి పండుగల రద్దీ సమయంలో చాందినీ చౌక్, సదర్ బజార్, కరోల్ బాగ్ వంటి ప్రధాన మార్కెట్లలో రూ.10 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యాపారం దెబ్బతినే ప్రమాదం ఉందని, కాబట్టి ఈ ర్యాలీని నవంబర్ 10 తర్వాతకు వాయిదా వేయాలని ఆయన కోరారు. ఈ విజ్ఞప్తిపై సోమవారం సోషల్ మీడియా వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. ఢిల్లీలోని ప్రతి ఒక్క వ్యాపారికి తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. "ఢిల్లీలోని ప్రతి వ్యాపారికి చెబుతున్నాం.. మీ బాధను మేము పూర్తిగా అర్థం చేసుకున్నాం, మీ వెంటే ఉంటాం" అని పేర్కొన్నారు. అయితే, మెట్రో స్టేషన్లను మూసివేయడం, రహదారులను సీల్ చేయడం, రాజధాని నగరాన్ని లాక్‌డౌన్ చేయడం వంటి చర్యలకు ప్రభుత్వమే కారణమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

**ఓటు చోరీ జరిగితే ఏదీ సురక్షితం కాదు**

దేశంలో ఓటు చోరీ జరిగితే సామాన్యుల జీవితంలో ఏదీ సురక్షితంగా ఉండదని రాహుల్ హెచ్చరించారు. పౌరుల దుకాణాలు, కష్టపడి దాచుకున్న పొదుపు సొమ్ము, చివరకు చిన్నారుల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ సమస్యకు మూలకారణాన్ని పరిష్కరించాలని సూచిస్తూ.. "ప్రధాని మోదీకి స్పష్టంగా చెప్పండి.. నిందితుడు నంబర్ 4 అయిన జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించండి, ఆ తర్వాతి ముప్పై సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" అని రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. కాగా, ఓటు చోరీ కుట్ర వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తర్వాతి స్థానంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను నాలుగో నిందితుడిగా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆరోపిస్తోంది. మరోవైపు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని, యూపీలోని పిలిభిత్‌లోనే పది వేలకు పైగా ఓటర్ల రికార్డుల్లో తీవ్ర అవకతవకలు బయటపడ్డాయని ఇండియా కూటమి ఆరోపిస్తున్న నేపథ్యంలో.. నవంబర్ 1న తలపెట్టిన ఈ భారీ ర్యాలీ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.



# రఘురామకృష్ణంరాజుకు సుప్రీం షాక్

( మొదటి పేజీ తరువాయి )

రుణంగా పొందారు. అయితే, ఆ రుణ నిధులను అసలు ప్రాజెక్ట్ అవసరాలకు వినియోగించకుండా.. నకిలీ కొనుగోలు పత్రాలు (ఫేక్ బిల్స్), బూటకపు అకౌంట్లను సృష్టించి గ్రూప్ కంపెనీలకు మళ్లించారని బ్యాంకులు ఆధారాలతో సహా సీబీఐకి ఫిర్యాదు చేశాయి. ఈ భారీ ఆర్థిక కుంభకోణంపై రంగంలోకి దిగిన సీబీఐ.. రఘు రామకృష్ణంరాజుతో పాటు ఇతర డైరెక్టర్లపై ఐపీసీ సెక్షన్లు 120బీ (నేరపూరిత కుట్ర), 420 (మోసం), 467, 468, 471 (ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి) మరియు అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

**సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు**

ఈ కేసుకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఆర్థిక నేరాలకు సంబంధించిన దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, దర్యాప్తు అధికారి నిర్ణీత 16 వారాల్లోగా పూర్తిస్థాయి విచారణను ముగించి ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్న ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ మేరకు రఘురామకృష్ణంరాజుతో పాటు ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ డైరెక్టర్లు కనుమూరు ఇందిరా ప్రియదర్శిని, రమాదేవి, దుంపల మధుసూధన రెడ్డి, అంబేద్కర్ రాజ్‌కుమార్ గంటా, నారాయణ ప్రసాద్ తదితరులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లన్నింటినీ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

**న్యాయస్థానంలో వాదనలు**

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ.. కేవలం ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగానే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, స్వతంత్ర డైరెక్టర్ల వాదనలను హైకోర్టు సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం.. "ఈ వాదనలను మీరు గతంలో హైకోర్టులోనే ఎందుకు వినిపించలేదు?" అని నేరుగా ప్రశ్నించారు. గతంలో ఈ సీబీఐ కేసును కొట్టివేయాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆర్థిక నేరాల తీవ్రత దృష్ట్యా జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పిన హైకోర్టు, పిటిషన్లను తోసిపుచ్చుతూ దర్యాప్తునకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రఘురామకృష్ణంరాజు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ప్రతికూల తీర్పు రావడం గమనార్హం.

# రామాయణం వంటి ఇతిహాసం రచించిన గొప్ప మహనీయుడు వాల్మీకి మహర్షి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ కలెక్టరేట్ లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు




**వరంగల్, కలెక్టరేట్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో వర్దన్నపేట ఎమ్మెల్యే అధికారి కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేర కార్పొరేషన్ చైర్మెన్ సంగ వెంకట రాజం, గ్రంథాల చైర్మెన్ మీసాల ప్రకాశ్ , అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పుష్పలత,కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొని వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ శ్రీ వాల్మీకి మహర్షి గురించి రాబోయే తరానికి వారి జీవిత చరిత్రను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం మంచి తరుణం అన్నారు.

**రామాయణం లాంటి గొప్ప ఇతిహాసం రచించిన మహనీయుడు శ్రీ**

వాల్మీకి మహర్షి అని ఆయన రచించిన రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకమని, అందులోని నీతి, ధర్మం, సత్యం, కుటుంబ విలువలు, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కలెక్టర్ అన్నారు. వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేస్తూ, ఆయన జయంతి వేడుకలను ఘనంగా ర్వహించడం మనందరి బాధ్యత అని మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకమని చైర్మన్ మీసాల ప్రకాశ్ అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు, రచనలను చదవడం ద్వారా యువతలో మంచి ఆలోచనలు, నైతిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మందమర్రిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం

**మందమర్రి, మహా 26:** మందమర్రి ఏరియాలో సింగరేణి సంస్థ గత విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ జీఎం జి.ఎల్. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీ.వి.సీ) ఆదేశాల మేరకు నిజాయితీతో సమృద్ధి అనే నినాదంతో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్వతంత్ర భారత తొలి హోంమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏ సంస్థలోనైనా లక్ష్యాలు ఎంత ఉన్నతంగా ఉన్నా, ప్రణాళికలు ఎంత పకడ్బందీగా ఉన్నా, అమలులో అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం చోటు చేసుకుంటే ఆశించిన లక్ష్యాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి వల్ల ఉద్యోగుల్లో నైతిక ధైర్యం దెబ్బతింటుందని, ఇది సంస్థ మనుగడకే ప్రమాదకరమని అన్నారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనం పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి విజిలెన్స్ సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, కమ్యూనికేషన్ సెల్ అండ్ సేవా కోఆర్డినేటింగ్ ఆఫీసర్, సీనియర్ పీఓ సత్యనారాయణ, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక, జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, ఫారం 6, 7, 8 దరఖాస్తుల పెండింగ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర ఎన్నికల అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ... ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని, అనర్హులుగా గుర్తించిన సందర్భాల్లో అందుకు గల కారణాలను సంబంధిత ఆధారాలతో సహా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి...**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీ అని తెలిపారు. ఫారం18 ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తుల ద్వారా ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించి, గడువులోగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఆమోదించిన మరియు తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు.

**పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరిస్తాం..**

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేస్తామని పేర్కొన్నారు. అనవసర జాప్యాన్ని నివారిస్తూ, పెండింగ్ అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపడతామని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- నవంబర్ 6లోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద

**వరంగల్, కలెక్టరేట్ మహా :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితాను 1.11.2026 అర్హత తేదీగా నిర్ణయించి నూతనంగా రూపొందిస్తున్న నేపథ్యంలో, జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత్ దేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీని కలిగి ఉండి,నిర్ణీత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందే ఆ డిగ్రీని పొందిన నియోజకవర్గ నివాసితులు దీనికి అర్హులు అని వారు పేర్కొన్నారు. ఓటు వేయడానికి,ఓటర్లు ప్రత్యేకంగా పట్టభద్రుల ఓటరు గా నమోదు చేసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరగబోయే పట్టభద్రుల ఎన్నికలకు అర్హత తేది 1.11.2026 గా నిర్ణయించబడినదని, అందుకు ఓటరు 31 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పూర్తి చేసిన వారు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా 6 11 2026 శుక్రవారం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో https://ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు ఫారం18తో పాటు డిగ్రీ సర్టిఫికెట్ ధ్రువీకరణ ప్రతిని, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో సంబంధిత సహాయ ఓటరు నమోదు అధికారి లేదా నియమిత అధికారులకు సమర్పించాలని తెలిపారు.జిల్లాలోని పట్టభద్రులందరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు భాగస్వాములు కావడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఓటర్ల జాబితా ముసాయిదా, తదుపరి ప్రక్రియ అనంతరం తుది ఓటర్ల జాబితాను 30.12.2026 న ప్రచురించనున్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు చేసుకుని ఓటరు జాబితాలో తమ పేరు నమోదు అయ్యేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.



# అంతరాష్ట్ర నేరగాడి అరెస్ట్

**వాట్సాప్ లింకుల ద్వారా ఆర్థిక మోసాలు వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ మహా :** వాట్సాప్ లింకుల ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంగిడి గ్రామానికి చెందిన ఒక బాధితుడి వాట్సాప్ కు నకిలీ లింక్ పంపించి, అతని బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల నుంచి మొత్తం 4 లక్షల 20 వేల 210 రూపాయలు కాజేసినట్టు తెలిపారు. సాంకేతిక ఆధారాలతో రాజస్థాన్ కు చెందిన నిందితుడు దినేష్ పటేల్ ను గుజరాత్‌లో గుర్తించి బేల పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అమ్మాయిల వలపు సేవల పేరుతో నకిలీ లింకులు పంపుతూ దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు పాల్పడినట్టు వెల్లడించారు.నిందితుడు ఇతరుల గుర్తింపు పత్రాలను ఉపయోగించి సిమ్ కార్డులు సేకరించి, నకిలీ కాల్ గర్ల్ లేదా అమ్మాయిల సేవలు సర్వీసుల వెబ్‌సైట్ లింకులను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రచారం చేసేవాడన్నారు.. ఆ లింకులను నమ్మి సంప్రదించిన బాధితులతో టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా మాట్లాడి, వివిధ రకాల సేవలు అందిస్తామని నమ్మించేవాడన్నారు.బాధితులు పంపిన డబ్బులను మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించడం, క్రెడిట్ కార్డుల ద్వారా డబ్బులు చెల్లించిన సందర్భాల్లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వేదికల నుంచి గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేసి వాటి ద్వారా వస్తువులు పొందడం చేసేవాడని తెలిపారు. అయితే బాధితులకు ఎలాంటి సేవలు అందించకుండా మోసాలకు పాల్పడేవాడన్నారు. ఈ విధంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురిని మోసం చేసినట్లు ,హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, వనస్థలిపురం, నార్సింగి పోలీస్ స్టేషన్ల పరిధుల్లోనూ ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడి నుంచి సైబర్ నేరాలకు ఉపయోగించిన మూడు మొబైల్ ఫోన్లు, ఒక మినీ ఐప్యాడ్, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిని బాధితుల నుంచి కాజేసిన డబ్బులతో కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపాడు. స్వాధీనం చేసుకున్న పరికరాల ఆధారంగా మరిన్ని సైబర్ నేరాలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇతనిపై దేశవ్యాప్తంగా 220 ఫిర్యాదులు, తెలంగాణలో 20 ఫిర్యాదులు నమోదైనాయన్నారు. మోసపోయిన డబ్బులలో కోర్టు ద్వారా బాధితులకి తిరిగి 2 లక్షల రూపాయలు అందజేసినట్టు తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, బేల ఎస్ఐ మధుకృష్ణ, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు ఇతరుల గుర్తింపు పత్రాలను ఉపయోగించి సిమ్ కార్డులు సేకరించి, నకిలీ కాల్ గర్ల్ లేదా అమ్మాయిల వలపు సేవలు సర్వీసుల వెబ్‌సైట్ లింకులను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రచారం చేసేవాడు. ఆ లింకులను నమ్మి సంప్రదించిన బాధితులతో టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా మాట్లాడి, వివిధ రకాల సేవలు అందిస్తామని నమ్మించేవాడు.

**ప్రజలకు జిల్లా ఎస్పీ సూచనలు:**

- గుర్తుతెలియని వ్యక్తులు పంపే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లింకులను ఓపెన్ చేయవద్దు.
- ఎస్కార్ట్ సర్వీసులు,కాల్ గర్ల్స్, అమ్మాయిల వలపు సేవలు అంటూ ఆన్‌లైన్ సేవల పేరుతో ముందస్తు చెల్లింపులు కోరేవారిని నమ్మవద్దు.
- బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల వివరాలు, ఓటీపీలు ఎవరికీ తెలియజేయవద్దు.
- అనుమానాస్పద లావాదేవీలు జరిగిన వెంటనే బ్యాంకును సంప్రదించి, సైబర్ ఆర్థిక మోసాల హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి. అలాగే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.
- సైబర్ నేరగాళ్లు ఉపయోగించే కొత్త పద్ధతుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు గురి కాకుండా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.
- ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, బేల ఎస్ఐ మధుకృష్ణ, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

- ఎల్‌నినో నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి..
- బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి బిచ్చన్న

**మణుగూరు, మహా :** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి బిచ్చన్న ఉద్యోగులకు సూచించారు. సోమవారం బీటీపీఎస్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో బిచ్చన్న మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ ఉద్యోగులపై మరింత బాధ్యత ఉందన్నారు. కర్మాగారంలో నీటి వృథాను అరికట్టేందుకు పైపులైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్ దీపాలను వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత నెలకొన్న నేపథ్యంలో బీటీపీఎస్ నుంచి అధిక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. బీటీపీఎస్ పనితీరుపై జెన్కో ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమైందని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్లు మురళీకృష్ణ, డబ్ల్యూ రమేష్‌బాబు, టి శ్రీనివాసరావు, సీహెచ్ రామ్మోహన్, పలువురు అధికారులు, అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

- ప్రజల నుంచి ప్రజావాణికి 76 ఫిర్యాదులు
- పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, పశువుల సంరక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, వ్యవసాయ ప్రణాళిక, విద్యుత్ సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సమస్యలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రానున్న రబీ సీజన్‌లో వేరుశెనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు సూచనలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, ఓవర్‌లోడ్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇతర శాఖలకు సంబంధించి 37, మొత్తం 76 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తాళ్లపేట నుండి హైదరాబాద్ వరకు... మంచిర్యాల కాంగ్రెస్ వర్గపోరుతో ప్రజల్లో ఆందోళన

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** ప్రశాంతంగా ఉండే మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గపోరు ఇప్పుడు బహిరంగ ఘర్షణగా మారింది. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో బతుకమ్మ వేడుకల్లో మొదలైన చిన్న ఘర్షణ, ఇప్పుడు హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయం వరకు చేరింది.

అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా తాళ్లపేటలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వర్గీయుడు ఆకుల దుర్గప్రసాద్, మహిళలపై టపాసులు వేశారన్న ఆరోపణతో గొడవ మొదలైంది. ఆ తర్వాత దసరా రోజు రాత్రి మళ్లీ ఘర్షణ జరిగింది. ప్రేమ్ సాగర్ రావు అనుచరులపై ప్రత్యర్థి వర్గం దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు.

**ప్రేమ్ సాగర్ రావు, జగన్మోహన్ రావు - వర్గపోరు హైదరాబాద్ కు ఎలా చేరింది..?**

ఈ గొడవలో ఒకవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గం, మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత మంతెన జగన్మోహన్ రావు వర్గం ఉంది. జగన్మోహన్ రావుకు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అండగా ఉన్నట్లు తెలుస్తోంది. జగన్మోహన్ రావు గతంలో ప్రేమ్ సాగర్ రావు అనుచరుడే కావడం గమనార్హం. ఘర్షణలు ముదరడంతో జగన్మోహన్ రావు ఆదివారం హైదరాబాద్ లో డీజీపీ సీవీ ఆనంద్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాళ్లపేటలో సర్పంచ్ పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, మంచిర్యాలలో శాంతి భద్రతలు క్షీణించాయని వినతిపత్రం ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కూడా కోరినట్లు సమాచారం.

**ఒకే పార్టీ వారే కొట్టుకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి..?**

అధికార పార్టీ నేతలే బహిరంగంగా కొట్టుకోవడం సామాన్య ప్రజల్లో భయాన్ని, అసహనాన్ని కలిగిస్తోంది. పండుగ రోజు కూడా పోలీసులు 300 మంది బలగాలను మోహరించాల్సిన పరిస్థితి రావడం, బైపాస్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేయడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడాల్సిన నాయకులు వర్గపోరుతో జిల్లా ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మంత్రి అనుచర వర్గం, మరోవైపు ఎమ్మెల్యే అనుచర వర్గం పోటాపోటీ వర్గాపోరు వల్ల స్థానిక పోలీసులకు చాలెంజ్ గా మారిందని చెప్పవచ్చు.

**ఈ గొడవల వల్ల లాభం ఎవరికి..!?**

ఈ వర్గపోరు వల్ల నష్టపోయేది సామాన్య కార్యకర్తలు, ప్రజలే. కానీ రాజకీయంగా లాభం ప్రతిపక్షాలకే. కాంగ్రెస్ లో అంతర్గత కలహాల వల్ల ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ లకు రాజకీయంగా బలం చేకూరుతోంది. పార్టీ బలహీనపడితే తమకు అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.అందులో భాగంగా ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి అండతోనే ఎమ్మెల్యే అరాచకాలు సాగుతున్నాయి. ప్రజా ప్రతినిధి కాని వ్యక్తికి 300 మంది పోలీసులతో రక్షణ ఏంటి.? హోం శాఖ మంత్రిగా ఉన్న సీఎం శాంతి భద్రతలను గాలికి వదిలేశారు అని ఆరోపించారు. ఈ వర్గపోరుపై సమగ్ర విచారణ జరిపి, దాడులకు పాల్పడుతున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై బీజేపీ హైకమాండ్ కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి తాళ్లపేటలో మొదలైన నిప్పు ఇప్పుడు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ను రెండుగా చీల్చింది. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



## పేదల ఆరోగ్యానికి పల్లా భరోసా

**రోగులను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

**వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే**

**పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యం**

**హైదరాబాద్ సిటీ, మహా :** పేదల ఆరోగ్యానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి భరోసాగా నిలుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందు కు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఎన్ని కల్లో విజయం సాధించినప్పటి నుంచి పలుమార్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఘట్కేసర్‌లోని నీలిమ ఆస్పత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శించి ఆప్యాయంగా పలకరించారు. రాష్ట్రంలోనే పల్లా సేవలు ఆదర్శంతంగా, స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నాయి.

**-రోగులతో ఆత్మీయ పలకరింపు..ఆరోగ్యంపై ఆరా**

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. 'ఆరోగ్యం ఎలా ఉంది? వైద్యం సక్రమంగా అందుతోందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?' అని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న చికిత్స, వైద్య సేవల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే నా లక్ష్యం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాను. ఆధార్ కార్డు ఉంటే చాలు.. ఆస్పత్రిలో చికిత్స పొందవచ్చు..పార్టీలకు అతీతం గా ప్రజలందరికీ వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటాను. ప్రజల ఆరోగ్యమే నా ప్రాధాన్యం అని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



# పేగులకూ టీబీ ముప్పు!



**సాధారణ జీర్ణ సమస్యగా పొరబడొద్దు.. ప్రారంభ లక్షణాలతోనే అప్రమత్తం కావాలి**

క్షయవ్యాధి (టీబీ) అనగానే చాలామందికి ముందుగా గుర్తుకొచ్చేది ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధి. దగ్గు, కఫం, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాల గురించి చాలా మందికి అవగాహన ఉంది. అయితే టీబీ ఊపిరితిత్తులకే పరిమితం కాదు. శరీరంలోని ఇతర అవయవాల మాదిరిగానే జీర్ణవ్యవస్థలోని పేగులపైనా ప్రభావం చూపవచ్చు. దీనినే పేగుల క్షయవ్యాధి లేదా ఇంటెస్టైనల్ ట్యూబర్‌క్యులోసిస్ అంటారు. ప్రారంభంలో కడుపు నొప్పి, ఆకలి మందగించడం, అజీర్ణం, మల విసర్జనలో మార్పులు వంటి సాధారణ సమస్యల రూపంలో కనిపించడంతో చాలామంది దీనిని పెద్దగా పట్టించుకోరు. నెలల తరబడి లక్షణాలు కొనసాగినా సాధారణ జీర్ణ సమస్యగా భావించి చికిత్స ఆలస్యం చేయడం వల్ల వ్యాధి ముదిరే ప్రమాదం ఉంది. అందువల్ల పేగుల టీబీ గురించి అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరం.

**కారణాలు.. ఎలా వస్తుంది?**

పేగుల టీబీకి ప్రధాన కారణం మైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా. సాధారణంగా ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తుల్లో సంక్రమణకు కారణమవుతుంది. అయితే కొన్ని సందర్భాల్లో రక్తం, శోషరస వ్యవస్థ ద్వారా లేదా ఇతర మార్గాల్లో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి పేగులను ప్రభావితం చేయవచ్చు. కలుషిత ఆహారం లేదా పాశ్చరైజ్ చేయని పాలు వంటి వాటి ద్వారా కొన్ని రకాల క్షయవ్యాధి బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించే అవకాశం కూడా ఉంటుంది. అయితే ప్రతి రోగిలో వ్యాధి వ్యాప్తి విధానం ఒకేలా ఉండదు. టీబీ ఉన్న ప్రతి ఒక్కరికీ పేగుల టీబీ వస్తుందని భావించకూడదు.

రోగనిరోధక శక్తి తగ్గినవారు, హెచ్ఐవీతో జీవిస్తున్నవారు, పోషకాహార లోపం ఉన్నవారు, మధుమేహంt వంటి సమస్యలతో బాధపడేవారిలో టీబీ ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చు. అయినప్పటికీ ఆరోగ్యంగా కనిపించే వ్యక్తుల్లోనూ ఈ వ్యాధి సంభవించే అవకాశం ఉంది. అందువల్ల ప్రమాద కారకాలు లేవని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

**ఈ లక్షణాలను గమనించాలి**

పేగుల టీబీ లక్షణాలు నెమ్మదిగా ప్రారంభమై క్రమంగా తీవ్రత పెరగవచ్చు. కొన్ని వారాలుగా కొనసాగుతున్న కడుపునొప్పి, ముఖ్యంగా బొడ్డు చుట్టూ లేదా కడుపు కింది భాగంలో నొప్పి, ఆకలి తగ్గడం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, నీరసం, తక్కువ స్థాయి జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొందరిలో విరేచనాలు, మరికొందరిలో మలబద్ధకం ఏర్పడవచ్చు. కడుపు ఉబ్బరం, తిన్న ఆహారం సరిగా జీర్ణం కానట్లు అనిపించడం, కడుపులో అసౌకర్యం కూడా ఉండొచ్చు. కొందరిలో రక్తహీనత కనిపించవచ్చు.ఈ లక్షణాలు ఇతర వ్యాధుల్లోనూ కనిపిస్తాయి. అందుకే లక్షణాలను బట్టి మాత్రమే పేగుల టీబీ ఉందని నిర్ధారించలేం. ముఖ్యంగా కడుపునొప్పితోపాటు బరువు తగ్గడం, జ్వరం, ఆకలి మందగించడం వంటి సమస్యలు కొనసాగుతున్నప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. తీవ్రమైన కడుపునొప్పి, కడుపు బాగా ఉబ్బిపోవడం, వాంతులు, మలంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలు ఉంటే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.

**నిర్ధారణలో పరీక్షల పాత్ర**

పేగుల టీబీని గుర్తించడం కొన్నిసార్లు సవాలుగా మారుతుంది. ఎందుకంటే దీని లక్షణాలు పేగుల వాపు, ఇతర దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు, క్రోన్స్ వ్యాధి వంటి పరిస్థితులతో పోలి ఉండవచ్చు. రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, శారీరక పరీక్షల ఆధారంగా వైద్యులు అవసరమైన పరీక్షలను సూచిస్తారు. రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి పరీక్షలతోపాటు కొందరిలో కొలనోస్కోపీ నిర్వహించి పేగుల నుంచి చిన్న కణజాల నమూనా తీసుకుంటారు. దానిని పరీక్షించడం ద్వారా వ్యాధి నిర్ధారణకు సహాయపడుతుంది. అవసరాన్ని బట్టి మాలిక్యులర్ పరీక్షలు, ఇతర ప్రయోగశాల పరీక్షలు కూడా చేస్తారు. ఒక్క పరీక్ష ఫలితంతోనే అన్ని సందర్భాల్లో వ్యాధిని నిర్ధారించడం సాధ్యం కాకపోవచ్చు.

**అవగాహనే ఆరోగ్యానికి రక్షణ**

పేగుల టీబీపై అవగాహన తక్కువగా ఉండటం వల్ల కొందరిలో నిర్ధారణ ఆలస్యమవుతోంది. సాధారణ జీర్ణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకుండా, శరీరం ఇచ్చే హెచ్చరికలను గుర్తించడం అవసరం. సరైన పరీక్షలు, వైద్యుల సూచనలు, క్రమం తప్పకుండా మందుల వినియోగం ద్వారా ఈ వ్యాధిని ఎదుర్కోవచ్చు. ఆరోగ్యంపై అనుమానం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్య సలహా తీసుకోవడమే ఉత్తమ మార్గం.

**చికిత్స మధ్యలో ఆపకూడదు**

పేగుల టీబీకి సాధారణంగా పలు క్షయవ్యాధి నిరోధక మందులను కలిపి నిర్ణీత కాలం పాటు ఇస్తారు. చికిత్స వ్యవధి రోగి పరిస్థితి, వ్యాధి తీవ్రత, మందులకు బ్యాక్టీరియా స్పందన వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. చాలామందిలో సరైన చికిత్సతో వ్యాధి అదుపులోకి వస్తుంది. అయితే కడుపునొప్పి తగ్గిందని, జ్వరం పోయిందని మందులను మధ్యలోనే ఆపకూడదు. అలా చేయడం వల్ల వ్యాధి మళ్లీ తిరగబెట్టడం, మందులకు నిరోధకత పెరగడం వంటి సమస్యలు రావచ్చు. మందుల వల్ల దుష్ప్రభావాలు కనిపిస్తే స్వయంగా వాటిని నిలిపివేయకుండా వైద్యులను సంప్రదించాలి. కొన్ని సందర్భాల్లో పేగులు ఇరుకుగా మారడం, పేగుల్లో అడ్డంకి ఏర్పడడం లేదా ఇతర సమస్యలు తలెత్తవచ్చు. అటువంటి పరిస్థితుల్లో అదనపు చికిత్స లేదా శస్త్రచికిత్స అవసరమయ్యే అవకాశం ఉంది. అందుకే వ్యాధిని తొందరగా గుర్తించడం, నిపుణుల పర్యవేక్షణలో పూర్తి చికిత్స తీసుకోవడం ముఖ్యం.

**నివారణకు ఏం చేయాలి?**

టీబీ వ్యాప్తిని తగ్గించేందుకు దగ్గు, కఫం వంటి లక్షణాలతో బాధపడుతున్నవారు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఊపిరితిత్తుల టీబీ నిర్ధారణ అయితే వైద్యుల సూచనలను పాటించాలి. గాలి ప్రసరణ బాగా ఉండేలా చూసుకోవడం, అవసరమైన సందర్భాల్లో మాస్కులు ఉపయోగించడం, పోషకాహారం తీసుకోవడం వంటి చర్యలు ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడతాయి. పాశ్చరైజ్ చేసిన పాలు లేదా బాగా మరిగించిన పాలను తీసుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం కూడా ముఖ్యం.పేగుల టీబీని కేవలం ఆహారపు అలవాట్ల మార్పులతో నివారించలేం. అలాగే ఇంటి చిట్కాలు లేదా స్వయంగా మందులు వాడటం ద్వారా దీనిని నయం చేయలేం. కడుపునొప్పి, బరువు తగ్గడం, జ్వరం వంటి లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే వైద్యులను సంప్రదించాలి. వ్యాధిని ముందుగానే గుర్తించి, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించే అవకాశాలు పెరుగుతాయి.

# వామాకుతో ఆరోగ్యానికి మేలు!

**జీర్ణక్రియకు తోడు.. సంప్రదాయ వైద్యంలో ప్రత్యేక స్థానం**

**(ఫీచర్స్ డెస్క్)**

మన ఇంటి పెరట్లో సులభంగా పెరిగే మొక్కల్లో వామాకు ఒకటి. వంటల్లో రుచి, సువాసన కోసం ఉపయోగించే ఈ ఆకుకు సంప్రదాయ వైద్యంలోనూ ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా జీర్ణ సంబంధిత అసౌకర్యాలు, కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యల సమయంలో వామాకును ఇంటి చిట్కాగా ఉపయోగించే అలవాటు చాలా ప్రాంతాల్లో కనిపిస్తుంది. సహజంగా లభించే మొక్కలపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో వామాకు వినియోగం గురించి తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. అయితే సంప్రదాయంగా ఉపయోగిస్తున్నారనే కారణంతోనే ఇది అన్ని వ్యాధులను నయం చేస్తుందని భావించకూడదు. వామాకు గురించి తెలుసుకునేటప్పుడు దాని సంప్రదాయ వినియోగంతోపాటు శాస్త్రీయ ఆధారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

వామాకులోని ప్రత్యేకత ఏమిటి?

వామాకు మొక్కను కొన్ని ప్రాంతాల్లో కర్పూరవల్లి అని కూడా పిలుస్తారు. దీని ఆకులు మందంగా ఉండి, నలిపినప్పుడు ప్రత్యేకమైన సువాసన వెలువడుతుంది. వంటల్లో ఈ ఆకులను ఉపయోగించడం వల్ల రుచి, వాసన పెరుగుతాయి. సంప్రదాయ గృహవైద్యంలోనూ ఈ మొక్కకు ప్రాధాన్యం ఉంది. వామాకులో థైమోల్ వంటి సువాసననిచ్చే సహజ సమ్మేళనాలు ఉంటాయి. వీటిలోని కొన్ని పదార్థాలకు సూక్ష్మజీవులపై ప్రభావం చూపే లక్షణాలు ఉన్నట్లు ప్రయోగశాల స్థాయి పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ప్రయోగశాలలో కనిపించే ఫలితాలు మనుషుల్లోనూ అదే విధంగా పనిచేస్తాయని నిర్ధారించడానికి మరిన్ని పరిశోధనలు అవసరం. వామాకును ఔషధంగా ఉపయోగించడం, దాని నుంచి తయారుచేసిన సారాలను వినియోగించడం రెండూ ఒకటే కావు. అందువల్ల పరిశోధనల్లో వెల్లడైన అంశాలను నేరుగా ఇంటి చిట్కాలకు అన్వయించకూడదు. సహజంగా లభించే మూలికలపై అవగాహన పెంచుకోవడం మంచిదే అయినప్పటికీ, వాటి వినియోగంలో శాస్త్రీయ సమాచారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

జీర్ణక్రియకు ఎలా ఉపయోగపడుతుంది?

జీర్ణక్రియకు సంబంధించిన అసౌకర్యాలు ఎదురైనప్పుడు వామాకును సంప్రదాయంగా ఉపయోగిస్తుంటారు. కొందరు ఆకులను వేడి నీటిలో మరిగించి పానీయంగా తీసుకుంటారు. మరికొందరు వంటల్లో భాగంగా వినియోగిస్తారు. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలకు వామాకు ఉపయోగపడుతుందని సంప్రదాయ వైద్యంలో నమ్మకం ఉంది. అయితే ఈ ప్రయోజనాలకు సంబంధించి బలమైన వైద్య



ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి. ఆహారం తీసుకున్న తర్వాత కడుపు బరువుగా అనిపించడం, గ్యాస్ ఎక్కువగా ఏర్పడటం, ఆకలి మందగించడం వంటి సమస్యలు తరచూ ఎదురైతే వాటికి కారణాలను తెలుసుకోవాలి. ఆహారపు అలవాట్లు, తినే సమయాలు, కొన్ని పదార్థాలు పడకపోవడం లేదా ఇతర జీర్ణవ్యవస్థ సమస్యలు ఇందుకు కారణమవుతాయి. కేవలం వామాకు తీసుకోవడం వల్ల సమస్య పూర్తిగా తగ్గిపోతుందని భావించడం సరికాదు. తరచూ కడుపునొప్పి, వాంతులు, మలంలో రక్తం లేదా కారణం తెలియకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, ఆహారాన్ని సమయానికి తీసుకోవడం, శారీరక చురుకుదనాన్ని కొనసాగించడం జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి తోడ్పడతాయి.

సీజనల్ సమస్యలు, కీళ్ల ఆరోగ్యం

వాతావరణ మార్పుల సమయంలో కొందరికి గొంతులో అసౌకర్యం, జలుబు, దగ్గు వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో వేడి పానీయాలను తీసుకోవడం వల్ల తాత్కాలిక ఉపశమనం కలగవచ్చు. వామాకుతో తయారుచేసే పానీయాలను కూడా కొందరు సంప్రదాయ పద్ధతుల్లో ఉపయోగిస్తారు. అయితే వామాకు జలుబు, దగ్గు, ఆస్తమా లేదా ఇతర శ్వాసకోశ వ్యాధులను నయం చేస్తుందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక జ్వరం లేదా దీర్ఘకాలిక దగ్గు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వామాకు గురించి మాట్లాడేటప్పుడు కీళ్ల ఆరోగ్యం అంశం కూడా ప్రస్తావనకు వస్తుంది. సంప్రదాయ పద్ధతుల్లో కొన్ని మూలికలను కీళ్ల నొప్పులు, వాపు వంటి సమస్యలకు ఉపయోగిస్తుంటారు. అయితే వామాకును తీసుకోవడం లేదా చర్మంపై రాయడం వల్ల కీళ్ల వ్యాధులు నయమవుతాయని నిర్ధారించే స్థాయి శాస్త్రీయ ఆధారాలు లేవు. కీళ్ల నొప్పులు దీర్ఘకాలంగా కొనసాగితే, వాపు లేదా కదలికలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. మూలికలను ఉపయోగించడం వల్ల అవసరమైన వైద్య చికిత్స ఆలస్యం కాకుండా జాగ్రత్తపడాలి. సంప్రదాయ వినియోగాన్ని వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా కాకుండా, శాస్త్రీయ ఆధారాల పరిధిలోనే అర్థం చేసుకోవాలి.



ఇంట్లో పెంపకం.. వినియోగంలో జాగ్రత్తలు

వామాకును ఆహారంలో చేర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకులను పప్పు, చట్నీ, బజ్జీలు వంటి వంటకాల్లో ఉపయోగిస్తారు. ఆకుల ప్రత్యేకమైన వాసన వంటకాలకు భిన్నమైన రుచిని అందిస్తుంది. ఇంట్లో వామాకు మొక్కను పెంచుకోవడం కూడా సులభమే. తగిన వెలుతురు, నీరు అందే ప్రదేశంలో కుండీలో లేదా పెరట్లో పెంచుకోవచ్చు. నీరు నిలిచిపోని మట్టి, సరైన పారుదల ఉంటే మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. అవసరమైనప్పుడు కొన్ని ఆకులను కోసి వంటల్లో ఉపయోగించవచ్చు. ఆకులను వినియోగించే ముందు శుభ్రమైన నీటితో బాగా కడగాలి. మొక్కపై పురుగుమందులు లేదా ఇతర రసాయనాలు ఉండే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదైనా మూలికను అధిక మోతాదులో తీసుకోవడం మంచిది కాదు. వామాకును ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగించే ముందు దాని పరిమాణం, తీసుకునే విధానం గురించి నిపుణుల సలహా తీసుకోవాలి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు లేదా క్రమం తప్పకుండా మందులు వాడేవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. చర్మంపై ఉపయోగించినప్పుడు దురద, మంట లేదా అలర్జీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వినియోగాన్ని నిలిపివేయాలి. మొత్తంగా వామాకు మన వంటింట్లో ఉపయోగపడే సువాసనభరితమైన మొక్క మాత్రమే కాదు, సంప్రదాయ గృహవైద్యంలోనూ ప్రాచుర్యం పొందింది. అయితే సహజంగా లభించే ప్రతి పదార్థం పూర్తిగా సురక్షితమైనదని లేదా ప్రతి వ్యాధిని నయం చేస్తుందని అనుకోవడం సరికాదు. సమతుల ఆహారం, పరిశుభ్రత, క్రమబద్ధమైన వ్యాయామం, తగినంత నిద్రతోపాటు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సరైన వైద్య సలహా తీసుకోవడం ముఖ్యం. సంప్రదాయ పరిజ్ఞానాన్ని గౌరవిస్తూనే శాస్త్రీయ ఆధారాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఆరోగ్య పరిరక్షణలో ఉత్తమ మార్గం.



## పంచాయతీ సర్పంచ్ ను అభినందించిన ఎమ్మెల్యే

**దమ్మపేట ,మహా :** ఇటీవల హైదరాబాద్ లో ఆర్టిఐ లో శిక్షణ పొంది ,గౌరవ సత్కారం పొందిన పంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి ,రాం బాబులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆది నారాయణ సత్కరించారు. స్థానిక మల్లారం రైతు వేదికలో సోమవారం ఎల్నినో ప్రభావం పై జరిగిన సమావేశ అనంతరం ఆమెను అధికారు లు మద్యన గౌరవంగా సత్కరించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ని అభివృద్ధి పథంలో అగ్రగామిగా గుర్తింపు తీసుకురావడంలో సర్పంచ్ శ్రమను ఉన్నత అధికారులు గుర్తించారని పేర్కొన్నారు. ఒక మహిళా సర్పంచ్ కు దక్కిన అరుదైన గౌర వాన్ని ప్రతి ఒక్కరూ సత్కరించుకోవాలని ఆకాం క్షించారు. పంచాయతీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ ,పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆద్వర్యంలో కా ర్యకర్తలు ,అభిమానులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

## వెట్టిచాకిరీ నిర్మూలన పై విస్తృత అవగాహన కల్పించాలి

- **స్వేచ్ఛా రథం ను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా కలెక్టర్**



**వరంగల్, కలెక్టరేట్ మహా** : వెట్టిచాకిరీ నిర్మూలన కు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే రిటైర్డ్ ఐపీఎస్ కె.ఆర్నాగరాజు పేర్కొన్నారు. వె ట్టిచాకిరీకి గురైన కార్మికులను గుర్తించడం, వారిని రక్షిం చడం, పునరావాసం కల్పించడం, బాధితులకు అవసర మైన సహాయాన్ని అందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా, సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని వర్ధ న్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం,గ్రం థాల చైర్మన్ మీసాల ప్రకాశ్ చేతుల మీదుగా మీ పని, మీ జీవితం, మీ స్వేచ్ఛ అనే గోడపత్రికను ఆవిష్కరించి , వెట్టి చాకిరి పై అవేర్నెస్ కల్పించేందుకు ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వర్ధన్న పేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ వెట్టిచాకిరీ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.ఘట నలను గుర్తించడంలో ప్రభుత్వ శాఖల అధికారులు అప్ర మత్తంగా ఉండాలని, బాధితులను సకాలంలో గుర్తించి రక్షణ, పునరావాసం, అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా వె ట్టిచాకిరీ జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారు లకు సమాచారం అందించాలని కోరారు.వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో వెట్టిచాకిరీ చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని వారిని అరికట్టుటకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అడ్వాన్స్లు, అప్పులు, వేతనాలు నిలిపివేయడం, బెదిరింపులు, బలవంతం, మోసం వంటి పద్ధతుల ద్వారా కార్మికులను పనిలో బంధించే పరిస్థితులు ఏర్ప డవచ్చని, అలాంటి పరిస్థితులను గమనించి లేబర్స్ కు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్ర జలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులు ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 08069434343 గురించి విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం మన్నారు.వెట్టిచాకిరీ అనేది కార్మికుల స్వేచ్ఛను హరించి, వారి హక్కులను కాలరాసే తీవ్రమైన దోపిడీ అని పేర్కొన్నారు.

**స్వేచ్ఛా రథం వరంగల్**

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు, ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, బాధితులకు ఎలాంటి ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉంది అనే అంశాలను ప్రచార రథం ద్వారా వివరించనున్నారని పేర్కొన్నా రు. వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు, కార్మికులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కా ర్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, వరంగల్ భార్గవ్ ప్రభుత్వ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్మిక శాఖ, పోలీసు శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ , జిల్లా న్యాయ సేవల సంస్థ , మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు భాగస్వాములయ్యా రు. సమాచార, పౌర సంబంధాల శాఖ మీడియా అకాడమీ సహకారంతో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తృ తంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నమని లేబర్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి కి అధికారులు డుమ్మా
# నోడల్ అధికారి ట్రైనింగు

**ప్రజావాణి ఇన్చార్జి అధికారి డుమ్మా**
**కింది స్థాయి అధికారులు ఫోన్లో బిజీబిజీ**

**వలిగొండ అక్టోబర్ 26 మహా న్యూస్ :** ప్రజా సమస్య లను నేరుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లతో పాటు మండల రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు అందుబాటు లో ఉంటూ ప్రజల విజ్ఞప్తులను స్వీకరిస్తారు. అయితే కొన్నిచోట్ల అధికారుల అలసత్వంతో ఈ కార్యక్రమం అభాసుపాలవుతున్నది.వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారంప్రజావాణి కార్యక్రమానికి కొంత మంది అధికారులు డుమ్మా కొట్టారు.ఉదయం 11 దాటినప్పటికీ కొంత మంది శాఖ అధికారులు కూడా రాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను పరిష్కరిం చేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొడితే అర్జీలను ఎవరికి ఇవ్వాలని ప్రజలు ఆరోపిస్తున్నారు ఈ విషయమై మండల ఎంపీడీవోను జలంధర్ రెడ్డి ను వివరణ కోరగా ట్రైనింగ్ లో ఉన్నట్లు తెలిపారు. ప్రజావాణి ఇన్చార్జి బాధ్యతలు ఎంపీ ఎంపీ ఓ కు అప్పజెప్పినట్లు తెలిపారు ప్రజావాణి ఇన్చార్జి కూడా డుమ్మా కొట్టడంతో ప్రజావాణికి హాజరైన కిందిస్థాయి సిబ్బంది ఫోన్లలో గంటల తరబడి ఫోన్లు మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారు.




## రైతులకు 'ఎల్‌నినో 'పై అవగాహన కల్పించండి

**గ్రామాల్లో అధికారులు పరిశీలన చేయండి.**
**నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష లో ఎమ్మెల్యే జారె.**

**దమ్మపేట ,మహా :** రైతాంగానికి ఎల్‌నినో ప్రభావం తో రాబోయే రోజుల్లో వర్షాభావం లోపించి ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జారె ఆదినారా యణ సూచించారు . సోమవారం మండల పరిదిలోని మల్లారం రైతు వేదికలో నియోజకవర్గ స్థాయి అధికా రులతో సమీక్ష సమావేశం జరిగింది. ఆత్మాకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు అద్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండించే పంటలను ఎంచుకోవాలని నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే సాగు ప్రారంభించాలని రైతులకు సూచించారు. ప్రస్తుతానికైతే నీరు అం దుబాటులో ఉందని ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాబోయే ఏడు నుంచి ఎనిమిది నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు .తమకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తూ వ్యవసాయం లో నష్టాలను తగ్గించుకునే దిశగా రైతులు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.

**గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి**

ఎల్‌నినో ప్రభావం వర్షాల కొరత అధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యవసాయంపై పడే ప్రభావాన్ని రైతులకు వివరించా లని అధికారులకు సూచించారు .గ్రామసభల ద్వారా ప్రతి గ్రామంలో రైతులతో పాటు ప్రజలకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు .వ్య వసాయ శాఖ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉంటూ స్థానిక పరిస్థితుల కు అనుగుణంగా పంటల ఎంపికపై తగిన సలహాలు ఇవ్వాలని సూచించారు. రైతులు ముందుగానే అప్రమత్తమై నీటి లభ్యతకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకుంటే పంట నష్టాలను కొంతవరకు నివారించవచ్చని ఈ సందర్భంగా వివ రించారు .రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్ర రావు , స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ,ఏడీఈ రవికుమార్ , అగ్రికల్చర్ ఏఈఓ లు అనుబాబు , చంద్రశేఖర్ రెడ్డి , కావ్య , వినోద్ , కేశవరా వు , కాంగ్రెస్ నాయకులు , బండి చెన్నారెడ్డి , మోహన్ రావు , ఆత్మ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు వద్దు..

- **తక్కువ నీటితో పండే పంటలే శ్రేయస్కరం.**
- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం, మహా** : యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తీవ్రంగా తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ఎట్టి పరి స్థితుల్లోనూ వరి సాగుకు వెళ్లవద్దని, ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగంతో పండే పంటలనే సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా రఘునాథపా లెం మండలంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటన లో భాగంగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమా లను ప్రారంభించడంతో పాటు, రైతులతో ముఖాముఖి మాట్లాడి ప్రస్తుత సాగు పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. అనంతరం అటుగా పూర్తిగా నీటితో కళకళలాడుతున్న నల్లకుంట చెరువును సంద ర్శించి, చెరువులో పూలు చల్లి జలకళను స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఖమ్మం అర్బన్ మండలంలో భాగంగా ఉన్న రఘునాథపాలెం ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసి, అప్పట్లో మంత్రి జానారెడ్డి సహకారంతో ప్రత్యేక మండలంగా ఏర్పాటు చే యించుకున్నట్లు గుర్తుచేశారు. ఈ ప్రాంత గిరిజనులకు, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలంలో సాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు దూరంగా ఉంటూ గిరిజన జనాభా అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వెంకటాయపాలెం డీప్ కట్ నుంచి మంచుకొండ లిఫ్ట్ ద్వారా దాదాపు 25 చె రువులకు సాగునీరు అందించే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. దీనికి తోడు బుగ్గవాగు నుంచి మరో 11 చెరువులకు నీటిని మళ్లించేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 46 మం డలాల్లో కేవలం రఘునాథపాలెంకు మాత్రమే సాగునీటి సౌకర్యాలు పరిమితంగా ఉన్నాయని, ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా నీరు అందిస్తున్నామని స్పష్టం చేశారు. చెరువుల్లో నీరు నిరంతరం నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి, రైతులు కూరగాయలు మరియు ఇతర అల్ప నీటి వినియోగ పంటల వైపు మళ్లే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొ న్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్ వనరులను అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల హెచ్చరించా రు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలోనే రఘునాథపా లెం మండలంలోని 36 గ్రామాల్లో ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను నిర్మించినప్పటికీ, ప్రస్తుత కాలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో త్రాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోందన్నారు. దీనిని నివారించేందుకు పుట్టకోట ప్రత్యేక తాగునీటి పథకం ద్వారా మండలాని కి నిరంతర నీటి సరఫరాను అందిస్తున్నట్లు తెలిపారు. కరువు ఛాయలు కమ్ముకునే ప్రమాదం ఉన్నందున పు ట్టకోట నీటి వనరులను నింపేలా అధికారులు అప్రమ త్తంగా ఉండాలని, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సహజ వనరులను వృధా చేయకుండా ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. నిరుపేదల సొంతింటి కల సాకారమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రఘునా థపాలెం మండలంలో మొదటి విడత కింద 1,300లకు పైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చే పట్టగా, తాజాగా రెండవ విడతలో మరో 1,100 ఇళ్లను కేటాయించినట్లు ప్రకటించారు. రాజకీయాలకు, పార్టీ లకు అతీతంగా కేవలం అర్హత ప్రాతిపదికనే గుడిసెల్లో జీవిస్తున్న నిజమైన పేదలకు ఈ ఇళ్లను అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. రైతులు తమ పొలాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించేలా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల వెల్లడించారు. పొలాలబాట రహదారుల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ. 75 కోట్లు మంజూరు చేయగా, త్వరలోనే మరో రూ. 25 కోట్లు విడుదల కానున్నాయని తెలిపారు. తద్వారా మొత్తం రూ. 100 కోట్ల భారీ నిధులతో గ్రామీణ ప్రాంతా ల్లోని పొలాలకు శాశ్వత రహదారులు అందుబాటులోకి వస్తాయన్నారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, రాయల నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ డీఈ మోతీలాల్, పలు శాఖల అధికారులు, భారీ సంఖ్యలో రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## భూమి లేని నిరుపేదలకు 916ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేయండి

**దమ్మపేట ,మహా :** మండల పరిదిలోని వడ్లగూడెం రెవిన్యూ గ్రామ పరిదిలో ఉన్న 916ఎకరాల ప్రభుత్వ భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్ర జావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రా లోని చింతలపూడి మండలం సీతానగరం గ్రామా నికి చెందిన కొందరి ఆంధ్రా బడా బాబుల అక్రమ ఆక్రమణలో తెలంగాణా కు చెందిన 916ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయ ని ,వాటిని నిరుపేదలకు పంపిణీ చేయాలని వినతి పత్రాన్ని అందించారు.



## నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న వ్యక్తి అరెస్టు

**రూ1,34,000.నకిలీ నోట్లు స్వాధీనం...**

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి సందీప్ నుంచి 500 నోట్లు 240, 200 నోట్లు 70, మొత్తం 310 నకిలీ నోట్లు, వాటి విలువా సూమరు 1,34,000 ఉంటుంది. నకిలీ నోట్ల సరఫరా కోసం వచ్చినట్లు పోలీసుల గుర్తించా రు. లిఖిత అనే మహిళకు డెలివరీ ఏజెంట్ గా పనిచేస్తున్నడు. అతని వద్ద ఒక ఆపిల్ ఐఫోన్, పోకో మొబైల్ ఫోన్లు పెద్ద షాపూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి సమిష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే జారె

**ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన**

**దమ్మపేట ,మహా :** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి యొక్క విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే *జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో డిజిటల్ విధానంలో చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండలంలో సోమవారం పరిశీలించారు .ఈ సందర్భంగా బాలరాజుగూడెం ,జగ్గారం ,అంకంపాలెం ,పట్వారిగూడెం ,పార్కల గండి గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు .కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి బాధ్యతగా పని చేయాలని పేర్కొన్నారు . గ్రామాల వారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిం చాలని సూచించారు .పార్టీ శ్రేణుల సమిష్టి కృషితోనే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్ , ప్రధానకార్యదర్శి వనమాల శ్రీని వాస్ , సీనియర్ నాయకులు వాసం శ్రీనివాసరావు , సర్పంచులు కుర్సం శ్రీనివాసరావు , వంకా జానకి రాముడు , మోకాళ్ళ గురుమూర్తి, మడకం గంగరాజు , కూరం అర్జున్ రావు , కాంగ్రెస్ నాయకులు బొల్లి కొండ నాగేశ్వరరావు , కోర్సా సాగర్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వవైభవం

- **అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.**
- **చారిత్రక ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత ఉండదు.**
- **రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం, మహా :** చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధ నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూ ర్వవైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని మూడో శతాబ్దపు చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, దాని పరిసర ప్రాంతాలను విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందేలా అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ద నున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నేలకొండపల్లిలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన పర్య టించి, బౌద్ధ స్థల సంరక్షణ, పునరుద్ధరణ మరియు పర్యాటక సదుపాయాల కల్పన అభివృద్ధి పనులకు అధికారికంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, దాదాపు 5055 సంవ త్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన ఈ చారిత్రక బౌద్ధ స్తూపం దేశంలోనే అత్యంత విశిష్టమైన మరియు పెద్ద స్తూపాలలో ఒకటిగా నిలిచిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వాల హయాంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం కొంత మేర ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో పనులు పూర్తికాకపోవడం విచారకరమ న్నారు. స్తూపం చుట్టూ ఉన్న సుమారు ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో గతంలో పురావస్తు శాఖ అధి కారులు జరిపిన తవ్వకాల్లో ఎన్నో అరుదైన, పురాతన వస్తువులు లభ్యమైనప్పటికీ, స్థానికంగా వాటిని భద్ర పరిచేందుకు తగిన వసతులు లేకపోవడం వల్ల వాటిని హైదరాబాద్ మ్యూజియానికి తరలించాల్సి వచ్చింద ని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలోనే అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుం టామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి తరలివచ్చే బౌద్ధ యాత్రికులు, స్థానిక ప్రజల అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ కార్యాచ రణ రూపొందిస్తామని మంత్రి వె వెల్లడించారు. బౌద్ధ కట్టడాలు, చరిత్రపై విశేష అనుభవమున్న ప్రముఖ నిపుణులను, ఉన్నతాధికారులను నేలకొండపల్లికి ఆహ్వానించి త్వరలోనే ఒక విస్తృత స్థాయి ఉన్నతస్థా యి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఖర్చుతో సంబంధం లేకుండా ఎంత నిధులైనా వెచ్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. దేశవిదేశాల నుంచి వచ్చే బౌద్ధులకు, పర్యాటకులకు ఈ ప్రాంతం ప్రధాన ఆక ర్షణగా నిలిచేలా అన్ని వసతులను సమకూరుస్తామని హామీనిచ్చారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెం కటలక్ష్మి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతి నిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాషా నరహరి ఆశయాలను సాధిస్తాం: సిపిఎం

- **పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప పోరాట యోధులు**
- **ఇబ్రహీంపట్నంలో ఘనంగా పాషా నరహరి 37వ వర్ధంతి..**

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 ప్రజాజ్యోతి:** మహబూబ్ పాషా, నరహరిల ఆశయాలను సాధించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సామెల్ అన్నారు. పాషా, నరహరి 37వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సామెల్ మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప పోరాట యోధులు పాషా, నరహరి అన్నారు. దున్నే వానికి భూమి కావాలని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లాలో ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం తాలూకాలో అనేక గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచారు. అసైన్మెంట్, సీలింగ్, పోరంబోకు, ఈనం, ఖరీజ్ ఖాతా వంటి భూములను వెలికి తీసి పేద ప్రజలకు ఇవ్వాలని అనేక పోరాటాలు చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న కామ్రేడ్ పాషా, నరహరి లకు ప్రజల్లో అభిమానం పెరగడంతో ఓర్వలేని కాంగ్రెస్, బిజెపి, ఆర్ఎస్ఎస్ గుండాలు పాషా, నరహరి లను అతికిరాతంగా కత్తులు, గోడండ్లతో నరికి పెట్రోల్ పోసి చంపారని గుర్తు చేశారు. వారు చనిపోయి 37 సంవత్సరాలు అవుతున్న ప్రజల్లో ఇప్పటికే ఆదరణ తగ్గలేదని తెలిపారు. పాషా, నరహరిలను చంపినంత మాత్రాన వారి ఆశయాలను చంపలేరని వారి ఆశయాలను సాధించాలన్నారు. ఎర్రజెండా నాయకత్వాన భూములు పంపిణీ చేస్తే నేడు ప్రభుత్వాలు పరిశ్రమల పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించాలి. ఎలినో ప్రభావంతో వర్షాలు కురువక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, జగన్ మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, నాయకులు ప్రకాష్ కారత్, ముసిలయ్య, స్వప్న, పురుషోత్తం, శంకర్, వెంకటేష్, ప్రభుదాస్, ధనేశ్వర్, చరణ్, శ్రీకాంత్, వీరేష్, నరసింహ, విజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# నిజాయితీ, పారదర్శకతతోనే అవినీతి రహిత సింగరేణి..

- **అవినీతి నిర్మూలన ప్రతి ఉద్యోగి బాధ్యత**
- **సింగరేణి అధికారి డి వెంకట రామారావు**

**మణుగూరు, మహా :** నిజాయితీ, పారదర్శకతతోనే అవినీతి రహిత సింగరేణిని నిర్మించగలమని సింగరేణి అధికారి డి వెంకట రామారావు అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ సూచనల మేరకు సింగరేణి మణుగూరు ఏరియాలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించాలని, విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 1 వరకు సమృద్ధి కోసం నిజాయితీ అనే నినాదంతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతికి తావులేని పని వాతావరణాన్ని కల్పించేందుకు ఉద్యోగులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సంస్థ అభివృద్ధితో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడంలో పారదర్శక పాలన కీలకమన్నారు. అవినీతిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని, అవినీతి సంబంధిత అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగులు, కార్మికుల్లో అవగాహన పెంపొందించేందుకు వారోత్సవాల్లో భాగంగా వివిధ గనులు, విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు, పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు సీహెచ్ రాజబాబు, ఎస్. రమేష్, జనరల్ సెక్రటరీ వి. మధన్ నాయక్, పర్సనల్ హెచ్ఓడీ నాగ రమేష్, ఏరియా సేఫ్టీ అధికారి జి నాగేశ్వరరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి కె. శ్రీనివాస్, వి రామేశ్వరరావు, ఏఐటీయూసీ ప్రతినిధి రాజశేఖర్, ఇతర అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# వాల్మీకి జీవితం ఆదర్శ ప్రాయం
## మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

**ఆదిలాబాద్ మహా :** రామాయణ మహాకావ్యాన్ని రచించి, ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన ఆదికవి మహర్షి వాల్మీకి అని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. సోమవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదని, ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ధర్మబద్ధంగా జీవించడం, సత్యాన్ని ఆచరించడం, పెద్దలను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతతో మెలగడం వంటి గొప్ప విలువలను రామాయణం మనకు బోధిస్తుందని అన్నారు. భాషలు ఎన్నైనా, భావం ఒక్కటే... ధర్మం, మానవత్వం, సత్యమే మానవ జీవితానికి నిజమైన మార్గదర్శకాలని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నప్పటికీ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణంలోని ఆదర్శాలు భాషలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజల హృదయాలను చేరుకుంటున్నాయని తెలిపారు. వివిధ భాషల్లో రామాయణం అందుబాటులో ఉండటం మన భారతీయ సంస్కృతి గొప్పతనానికి, మహర్షి వాల్మీకి సాహిత్య వైభవానికి నిదర్శనమని అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మనిషి తన ఆలోచనలను, ప్రవర్తనను మార్చుకొని ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలు బీసీ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం మంత్రులు

- **జోడేఘాట్‌లో కొమురం భీం వర్ధంతి వేడుకలు.**
- **ఆదివాసీ వీరుడికి అడ్లూరి లక్ష్మణ్ , సీతక్క నివాళులు**
- **భీం పోరాటాలు చిరస్మరణీయమన్న మంత్రులు**
- **ఆశయాల సాధనకు కృషి చేయాలని వెల్లడి**



**ఆదిలాబాద్ మహా :** జల్, జంగల్, జమీన్ హక్కుల కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కొమురం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమానికి వారు జిల్లా అధికారులు ఆదివాసీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆదివాసీల హక్కులు, స్వయంపాలన కోసం భీం చేసిన వీరోచిత పోరాటాన్ని స్మరించుకున్నారు.

**గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత- అడ్లూరి లక్ష్మణ్**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన అమరజీవి కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజనులకు సంబంధించిన జీఓల అమలుపై వచ్చిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. సంబంధిత జీఓల అమలుకు పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరిస్తూ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న కాస్మెటిక్, డైట్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలు, అటవీశాఖ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని పంపిస్తామని తెలిపారు. అక్కడ అమలవుతున్న మంచి విధానాలను పరిశీలించి, అవసరమైన వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఆదివాసీ ఆత్మగౌరవం కొమురం భీం - సీతక్క**

మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కొమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మ, బిర్సా ముండా వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. ఆదివాసీల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. యువత విద్యపై దృష్టి సారించి ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుస్సాడీ, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అంతకుముందు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్ లను మంత్రులు, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నిఖితా పంత్, ఐటీడీఏ పీఓ మంద మకరందు, కొమురం భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జోయల్, ప్రజాప్రతినిధులు, గిరిజన ప్రజలు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కొమురం భీం వర్ధంతి

**నివాళ్లు అర్పించిన నాయకులు అధికారులు**

**ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు**

**ఆదిలాబాద్ మహా:** కొమురం భీం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష పిలుపునిచ్చారు. సోమవారం కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ సమీపంలో గల విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసి నాయకులతో కలిసి కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంజీ గోండు విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ఆదివాసీ సంప్రదాయాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించి కలెక్టర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొమురం భీమ్ కేవలం ఆదివాసులతో పాటు మొత్తం జిల్లాకే మంచి మార్గదర్శి అని, ఆయన కోరుకున్న జల్, జంగల్, జమీన్' సాధన కోసం అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోడు పట్టాలు, రైతు భరోసా, ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలను బడికి క్రమం తప్పకుండా పంపాలని, మూఢనమ్మకాలకు పోకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉన్నందున నీటి సంరక్షణ అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చి, ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పద్ధతుల ద్వారా నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, కొమరం భీమ్ ఆశయ సాధనే లక్ష్యంగా జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అధికారులు, గిరిజన నాయకులు సమన్వయంతో పనిచేసి సంక్షేమ ఫలాలను అర్హులందరికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను చదివిస్తే వారు ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదుగుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రిమ్స్ ఆసుపత్రితో పాటు గిరిజనుల కోసం ప్రత్యేకంగా అనువాదకులను (ట్రాన్స్‌లేటర్స్) సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చిన్నచిన్న సమస్యలను రాయి సెంటర్లు పోలీస్ స్టేషన్ల ద్వారా అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని, ఇటీవల కాలంలో కొందరికి జైలు శిక్షలు పడినట్లు ఉదాహరణలతో వివరించారు. కావున ఆదివాసీ యువత చెడు అలవాట్లకు బానిసకాకుండా, గంజాయి సాగుకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ అనూష మాట్లాడుతూ, ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే కొమురం భీమ్ కు మనం ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. ప్రతి ఒక్కరు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ జీవన్ రెడ్డి, ఆదివాసీ నాయకులు , ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి గ్రంథాలు నేటి రేపటి తరాలకు మార్గదర్శకం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలో సోమవారం మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి. నియోజకవర్గ ప్రజలకు వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన బోధనలు సమాజంలో సత్యం, ధర్మం, మానవతా విలువలను పెంపొందించేందుకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా :** రాజేంద్రనగర్ సర్కిల్ 11 పరిధిలోని న్యూ గ్రీన్‌సిటీ కాలనీ, బుద్వేల్ ప్రాంతంలో రూ105.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన నూతన సీసీ రోడ్డుల నిర్మాణ పనులకు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులంతా ముందుకు రావాలి..

**బీజేపీ జిల్లా కార్యదర్శి కామసాని వీర మధుసూదన్..**

**మణుగూరు, మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల కో కన్వీనర్ కామసాని వీర మధుసూదన్ పిలుపునిచ్చారు. మణుగూరు టౌన్ పరిధిలోని బాపనగుంట గ్రామంలో బీజేపీ టౌన్ అధ్యక్షుడు ఈసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీర మధుసూదన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన వారు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ ప్రధాన కార్యదర్శులు బీరా రమేష్, పల్లపు కిషోర్ బాబు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల దుర్గారావు, కుంజా రామకృష్ణ, యువమోర్చా అధ్యక్షుడు కొంద్రు ప్రశాంత్, పాయం అఖిల్, రావులపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

- **తాత్కాలిక అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి**
- **వరంగల్ సీపీ ఎన్ శ్వేత, ఐపీఎస్**

**కమిషనరేట్, మహా :** రానున్న దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ తెలిపారు. విక్రయ కేంద్రాల ఏర్పాటు కోసం వారు అవసరమైన ధ్రువ పత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తుల ను నవంబర్ 2 వ తేదీ లోపు సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపిఎస్ తెలిపారు. దరఖాస్తు తో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్ఓసీ, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, గతంలో లైసెన్స్ ఉంటే దాని ప్రతి తో పాటు, అవసరమైన చోట్ల పక్క స్థల యజమానుల అనుమతి పత్రాలు, సైట్ ప్లాన్ బ్లూప్రింట్ సమర్పించాలి. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంక్ చలాన్ ను జారీచేయాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. ముఖ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# సామాజిక సేవలో సంస్థ ఫౌండర్ శ్రీధర్

**రెండు కాళ్లు పోయిన బాధితునికి అదునాతన వీల్ చైర్ అందజేత**

**పోచమ్మ మైదాన్, మహా :** వర్ధన్నపేటకు చెందిన గిద్దె గండ్డు విష్ణు వయసు 27 సంవత్సరాల యువకుడు ప్రమాదవశాత్తు రెండు కాళ్ళు పోయాయి, అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సామజిక సేవ సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపెల్లి శ్రీధర్ ఎలుకపెల్లి అకింత్ ను సహాయం కోసం ఒక వీల్ చైర్ కోరగా, వెంటనే అతని జన్మదినం సందర్భంగా విష్ణు కు వీల్ చైర్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తడుగుల చక్రి, ఎలుకపెల్లి రేవంత్, పాల్గొన్నారు.





## కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్ మహా ;** ప్రధాని నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఇంచార్జ్ కేసు రత్నం, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం మాజీ అధ్యక్షులు మహేందర్, మల్లారెడ్డి, వై శ్రీధర్,బిజెపి నాయకులతో కలిసి శంషాబాద్ చౌరస్తాలో ఖర్గేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లేష్ యాదవ్,వంశీ యాదవ్, బాత్కు శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, డి ఎల్ స్వామి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా పోటీలను ప్రారంభించిన... చిన్న జీయర్ స్వామి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామ్నగర్ లోని సమతా మూర్తి కేంద్రంలో సోమవారం చిన్న జీయర్ స్వామి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ క్రికెట్ పోటీలు రాంచరణ్ గ్రౌండ్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఫర్ బ్లైండ్స్ వారి సమన్వయంతో అక్టోబర్ 27, 28, 29 తేదీలలో జరుగుతాయి. బాల బాలికలు ఉత్సాహంగా అందరూ కలిసి ఈ పోటీలలో పాల్గొంటారు.




## హెలిప్యాడ్ పై మందుబాబులు చెలరేగిపోతున్నారు

### మందమర్రి ప్రజావాణిలో ఫిర్యాదు

**మందమర్రి, మహా :** మందమర్రి జూనియర్ కళాశాల ఆవరణ హెలిప్యాడ్ ప్రాంతంలో అసాంఘిక శక్తులకు, మందుబాబులకు అడ్డాగా మారిందని పేర్కొంటూ సామాజికవేత్త కొలుగూరి విజయ్ కుమార్ సోమవారం ప్రజావాణిలో తాసిల్దార్ సతీష్ కుమార్ కు ఫిర్యాదు చేశారు.

హెలిప్యాడ్ చుట్టూ పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగి, గుబురుగా మారడంతో రాత్రి వేళల్లో అక్కడ కొంతమంది మద్యం సేవిస్తూ, మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పరిసరాలను కలుషితం చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే పిచ్చి మొక్కలను తొలగించి, పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.

**వీధి దీపాలు లేవు**

పాలచెట్టు మూల నుండి పాలవాగు వరకు వీధి దీపాలు లేకపోవడంతో ఆ దారి వెంట వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో కొలుగూరి విజయ్ కుమార్ పేర్కొన్నారు. చీకటి కారణంగా ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

**భూ, ఇసుక మాఫియా దందా**

లెదర్ ఇండస్ట్రియల్ పార్క్ హద్దులను కాపాడేందుకు ప్రభుత్వం తవ్వించిన కందకాలను రాత్రికి రాత్రే భూమాఫియా, ఇసుక మాఫియా జేసీబీలతో పూడ్చి వేసి, మట్టిని, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసే కుట్ర జరుగుతోందని, సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పర్యావరణ విధ్వంసం**

పశువులు మేపేవారు, వేటగాళ్లు విచ్చలవిడిగా చెట్లను నరికి వేయడమే కాకుండా, పక్షులు, వన్యప్రాణులను వేటాడుతూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని, వారిపై అటవీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకొని పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ అక్రమాలపై వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు వినతి పత్రంలో వెల్లడించారు.





# సత్తుపల్లిలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ సమరం

- పొంగులేటి జన్మదినం సందర్భంగా 73వ సీనియర్ మహిళల పోటీలు
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా ప్రారంభం
- మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు క్రీడా సంబరం
- 33 జిల్లాల నుంచి 34 జట్లు.. సుమారు 700 మంది హాజరు

**సత్తుపల్లి, అక్టోబరు 26**:మహా : పట్టణంలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలకు రంగం సిద్ధమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి 30 వరకు 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను ఈ నెల 28న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించనున్నారు. మాజీ తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో మువ్వా యూత్ ఈ క్రీడా సంబరాన్ని నిర్వహిస్తోంది. స్థానిక రాణి ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి.

**ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

ఈ నెల 28న జరగనున్న ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. మహిళా క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి, రాష్ట్రస్థాయిలో తమ నైపుణ్యాన్ని చాటుకునేందుకు అవకాశం కల్పించడమే లక్ష్యంగా పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 34 జట్లు పోటీల్లో పాల్గొననున్నాయి. క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు, అతిథులు కలిపి సుమారు 700 మంది హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోటీలు సజావుగా సాగేందుకు, వర్షాలు, ఇతర వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

**మహిళా క్రీడాకారులకు ప్రోత్సాహం**

మహిళల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడం, క్రీడారంగంలో మరిన్ని అవకాశాలు కల్పించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని మువ్వా విజయబాబు తెలిపారు. కబడ్డీ మహిళల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం రాణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలను వెల్లడించారు. ఈ నెల 30న ముగింపు కార్యక్రమంలో విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జిల్లా శాసనసభ్యులు బహుమతులు అందజేయనున్నారు. క్రీడాభిమానులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలని మువ్వా విజయబాబు కోరారు. విలేకరుల సమావేశంలో కబడ్డీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి కటికాల క్రిస్టఫర్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కె. స్వాతిముత్యం, ఖమ్మం జిల్లా సంయుక్త కార్యదర్శి చి. సుధాకర్, సత్తుపల్లి పట్టణం ఒకటో వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, ఆరో వార్డు కౌన్సిలర్ సుజల రాణి, బెతుపల్లి సర్పంచి దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు), భీమవరం సర్పంచి వంట్ల రమేష్, పట్టణ, గ్రామీణ కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.




## స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

**వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా గుర్తింపు కార్డులు**
**జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ మహా :** రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో యూసీడీ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో యూసీడీ కార్యకలాపాలపై డీపీఓలు, సీఓలతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ, మోడల్ మార్కెట్ల అభివృద్ధి, స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాగే వీధి వ్యాపారులకు అనుకూలంగా స్ట్రీట్ వెండింగ్ జోన్లను ఏర్పాటు చేసి, వారు సులభంగా వ్యాపారాలు నిర్వహించుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అర్హులైన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించి, వారి జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూసీడీ పీఓలు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

# సత్యనిష్ఠతో సమృద్ధి, అవినీతి రహిత సమాజమే లక్ష్యం!

**వరంగల్ సీపీ ఎన్. శ్వేత ఐపీఎస్**

**హనుమకొండ, మహా :** భారతదేశ తొలి ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి నవంబర్ 1వ తేదీని పురస్కరించుకుని జాతీయ ఐక్యత, సమగ్రత, దేశ సమైక్యత ప్రాధాన్యత ను చాటిచెప్పేలా సత్య నిష్ఠతో సమృద్ధి అనే ఇతివృత్తం తో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న జాగరూకత అవగాహన వారోత్సవాల్లో భాగంగా, సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సీపీ సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది, అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మదుసుధన్, హన్మకొండ ఏసీపీ నరసింహారావు, సిసిఎస్ ఏసీపీ సదయ్య, ఎఆర్ ఏసీపీలు సుదీంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీదర్, చంద్రశేఖర్ తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, క్యాజువల్ పండుగ సెలవులు అమలు చేయాలి

**తెలంగాణ మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్**

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణ మున్సిపల్ స్టాప్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆనంద్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జోన్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు పారిశుద్ధ్య , ఎన్టమాలజీ, హౌస్ కీపింగ్, ఇంజనీరింగ్ వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులను నాలుగు కేటగిరీలుగా గుర్తించాలి.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్మికులకు 8 పండుగ మరియు 15 క్యాజువల్ లీవులు అమలు చేస్తామని అధికారులు స్పెషల్ కమిషనర్ గతంలో సర్కులర్ 19062026 నాడు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. జోనల్ స్థాయిలలో అమలు కావడం లేదు కార్మికులకు జాతీయ పండుగ, క్యాజువల్ సెలవులను అమలు పరచాలన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి పర్మినెంట్ చేసేంతవరకు కార్మికులను నాలుగు కేటగిరీలుగా గుర్తించి అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.26వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.30 వేలు, స్కిల్డ్ కార్మికులకు రూ.36 వేలు, హై స్కిల్డ్ కార్మికులకు రూ.42 వేలు వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికులు విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ వర్తింప చేయాలి. అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాలకు 25 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలి. మరణించిన కార్మికుల కుటుంబాలకు దాన సంస్కారాల ఖర్చులు రూ.30వేలు. 60 సంవత్సరాలు వయోపరిమితి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని జూనియర్ అసిస్టెంట్ కి వినతి పత్రం అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, మండల అధ్యక్షులు రాజు, కార్యదర్శి సాయిలు, పెంటయ్య, విజయ్ కుమార్, శ్రీను, నరసింహ, కృష్ణ, శంకరయ్య, రాములమ్మ, సబితా, పద్మ, శకుంతల, సరోజ, అండాలు, రమ, కార్మికులు పాల్గొన్నారు.



## నీటిని పొదుపు చేయండి.. భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి!

- రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం.. సత్తుపల్లి మున్సిపాలిటీ అప్రమత్తం
- ప్రతి ఇంటి నీటి కుళాయికి వాల్వ్ తప్పనిసరి.. లీకేజీలపై సమాచారం ఇవ్వండి
- బకాయిలు చెల్లించాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు, జరిమానాలు

**సత్తుపల్లి, అక్టోబర్ 26**: మహా : రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి మున్సిపాలిటీ సూచించింది. తాగునీటిని వృథా చేయకుండా అవసరానికి అనుగుణంగా వినియోగించాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా, కమిషనర్ నరసింహ వాటర్ సప్లై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి నీటి పొదుపు చర్యలపై పలు సూచనలు చేశారు. పట్టణంలో నీటి వృథాను అరికట్టడంతోపాటు సరఫరా నీటిని సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

**కుళాయికి వాల్వ్ ఏర్పాటు చేసుకోవాలి**

ప్రతి ఇంటి నీటి కనెక్షన్‌కు తప్పనిసరిగా వాల్వ్ ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. అవసరం లేనప్పుడు వాల్వ్‌ను మూసివేసి నీటి వృథాను అరికట్టాలని కోరారు. నిబంధనలు పాటించని కనెక్షన్లను వాటర్ సప్లై సిబ్బంది పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారని, అవసరమైతే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

**లీకేజీలపై వెంటనే సమాచారం ఇవ్వాలి**

ఇళ్ల పరిసరాల్లో, వీధుల్లో నీటి పైపుల నుంచి లీకేజీలు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నపాటి లీకేజీల వల్ల కూడా విలువైన నీరు వృథా అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

**నీటి పన్ను బకాయిలు చెల్లించాలి**

నీటి పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నీటిని పొదుపుగా వినియోగించడం, లీకేజీలను అరికట్టడం, పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా పట్టణంలో నీటి నిర్వహణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి చుక్కనూ విలువైనదిగా భావించి నీటిని పొదుపు చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా, కమిషనర్ నరసింహ కోరారు.




## చర్లపల్లిలో ప్రమాదాల నివారణకు బొల్లార్డ్స్ ఏర్పాటు

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే రెండు ప్రాంతాలను కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా రోడ్డు భద్రతా అధికారుల సహకారంతో చర్లపల్లిలోని అశోక్ నగర్, గణేష్ కమాన్ జంక్షన్ల వద్ద బొల్లార్డ్స్‌ను ఏర్పాటు చేశారు. రహదారి ప్రమాదాలను నివారించడం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడటమే ఈ చర్య యొక్క ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా వాహనదారులు, పాదచారుల భద్రత పెరగడంతో పాటు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని అధికారులు తెలిపారు. రోడ్డు భద్రతను పెంపొందించడానికి మరియు సురక్షితమైన, సజావుగా సాగే ట్రాఫిక్ వ్యవస్థను అందించడానికి కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు ఎల్లప్పుడూ ముందస్తు చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నారని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం అందరి బాధ్యత

**మొయినాబాద్ మహా :** ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపైనా ఉందని, ఓటు హక్కు పరిరక్షణే దేశ పరిరక్షణ అని ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం పిలుపునిచ్చారు.'ఓట్ బచావో దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నాయకత్వంలో జిల్లా సంయుక్త నాయకుల భాగస్వామ్యంతో ముఖ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచాలంటే ఓటు హక్కును కాపాడుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ప్రజలను చైతన్యవంతం చేయడానికే 'ఓట్ బచావో దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాబోయే నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, నియోజకవర్గం ఇంచార్జులు భీమ్ భరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, జగదీశ్వర్ గౌడ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోలిగిద్ద సత్యనారాయణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, నాయకులు ఏనుగు జంగారెడ్డి, షాబాద్ దర్శన్, పల్లగోల్ల మల్లేష్ యాదవ్, రాంరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ అమీర్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, పల్లగోల్ల అశోక్ యాదవ్, జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

- వారి ఆశయాల సాధనకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి మహా :** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని, వారు చూపిన మార్గంలో నడుస్తూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మహాకవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సమాజానికి అనేక నైతిక విలువలను, జీవన సత్యాలను అందించిన మహా కావ్యమని పేర్కొన్నారు. ఆదర్శ మానవుడి లక్షణాలు, కుటుంబ సంబంధాల ప్రాధాన్యత, మానవీయ విలువలను రామాయణం ద్వారా వాల్మీకి సమాజానికి తెలియజేశారని అన్నారు. రామాయణంలో పొందుపరిచిన విలువలు కుటుంబ వ్యవస్థ పటిష్టతకు, సమాజంలో పరస్పర గౌరవం, బాధ్యతాయుతమైన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. 'వసుధైక కుటుంబం' వంటి విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనకు రామాయణంలోని విలువలు అనుసంధానంగా ఉన్నాయని తెలిపారు. మహాకావ్యమైన రామాయణాన్ని రచించి తరతరాలకు ఆదర్శంగా నిలిచిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు. మహనీయుల బోధనలను, ఆదర్శాలను నేటి తరాలు తెలుసుకొని, వాటిని తమ జీవితాల్లో ఆచరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- పెండింగ్ నోటీసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి
- భౌతిక, ఆన్‌లైన్ రికార్డులు, ఆధారాలను భద్రపరచాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష




**పెద్దపల్లి మహా :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులకు సంబంధించిన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను భద్రంగా నిర్వహించాలని సూచించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, అవసరమైనప్పుడు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందించేలా రికార్డులు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం వంటి చర్యలకు సంబంధించి నిబంధనల ప్రకారం తగిన ధ్రువీకరణ పత్రాలను భద్రపరచాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పెండింగ్ పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనర్హమైనవిగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, అవసరమైన పత్రాలు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) దరఖాస్తుదారులు లేదా ఇతరులు ఆధారాలు కోరినప్పుడు వాటిని అందించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తుల పరిశీలనతో పాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను క్రమబద్ధంగా భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు), బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) తమ పరిధిలోని రికార్డులు, డాక్యుమెంట్లను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా, పేర్ల తొలగింపులు నిబంధనలకు అనుగుణంగా తగిన ఆధారాలతోనే జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, ఆర్డీఓలు గంగయ్య, సురేష్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

- విద్యార్థులకు పోలీస్ సేవలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

**పెద్దపల్లి మహా :** గోదావరిఖని: పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇండోఅమెరికన్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు అందిస్తున్న వివిధ పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. డయల్ 112, షీ టీమ్స్, సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్, స్టేషన్ రైటర్, వి.హెచ్.ఎఫ్. సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్, పార్ట్ మ్యాప్, ఆయుధాల భద్రత గది, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర విభాగాల పనితీరును విద్యార్థులకు వివరించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్కరూ మోటార్ వాహన చట్టాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వివిధ రకాల బందోబస్తు విధులు, సమాజంలో పోలీసుల పాత్ర, బాధ్యతలు, నేరాల నివారణలో పోలీసుల ప్రాధాన్యతను తెలియజేశారు. నేరస్తులను గుర్తించడంలో ఉపయోగించే ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ, ఆధునిక దర్యాప్తు విధానాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి వివరించారు. ఏదైనా నేరం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అవసరమైతే సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలకు భరోసా, నమ్మకం కల్పించేందుకు పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడికి వచ్చే బాధితుల సమస్యలను సానుకూలంగా విని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు లేదా చుట్టుపక్కల ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలియజేయాలని కోరారు. ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్య ఎంతో ముఖ్యమని, చదువు జీవితాల్లో మంచి మార్పును తీసుకువస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు అనూష, రాజశేఖర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల విధులపై విద్యార్థినులకు అవగాహన

కాల్వ శ్రీరాంపూర్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

పెద్దపల్లి మహా, కాల్వ శ్రీరాంపూర్: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు పోలీసుల విధులు, కేసుల నమోదు, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్సై గట్ల సుధాకర్ అవగాహన కల్పించారు. స్టేషన్‌లోని లాకప్, రికార్డుల నిర్వహణ, రిసెప్షన్ విభాగం పనితీరును వివరించారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందడం, ఫిర్యాదు చేయడం వంటి అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై, కానిస్టేబుల్ రజిని, రైటర్ జ్యోతి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి మహా :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య సర్వే నంబర్ 390లో మట్టి తవ్వకాలు, రవాణాకు సంబంధించిన అనుమతులు, లీజు పరిమితుల అంశాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మైన్స్ శాఖ ఏడీకి దరఖాస్తును పంపించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన గుర్రం రామస్వామి సర్వే నంబర్లు 83, 83/సి1, 83/సి3లో తనకు ఎకరం 35 గుంటల వ్యవసాయ భూమి ఉందని, భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరు గ్రామానికి చెందిన చింతల చుక్కమ్మ తన పేరు మీద ఉన్న ఇంటి ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని, అక్రమంగా పట్టా పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ గుజ్జుల నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు సమర్పించారు. దీనిపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన మామిడి రామ్ తన కుటుంబానికి గృహజ్యోతి పథకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించి అర్హత ఆధారంగా చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- మానవత్వం, సత్యం, ధర్మం విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహర్షి వాల్మీకి
- సీపీ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి మహా :** రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్‌తో పాటు పోలీస్ అధికారులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ప్రపంచం ఉన్నంతకాలం మహర్షి వాల్మీకి చరిత్ర, ఆయన రచించిన రామాయణం చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యబోధ వంటి ఉన్నత విలువలను మానవాళికి అందించిన అమూల్యమైన గ్రంథమని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి బోధనలు సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, సమానత్వం వంటి విలువలను పెంపొందించేందుకు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. మానవత్వం, సత్యం, ధర్మం వంటి ఉన్నత విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి సమాజానికి ఆదర్శప్రాయులని అన్నారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన రచనలు మానవ జీవితంలో నైతిక విలువలు, కర్తవ్యనిష్ఠ, ధర్మబద్ధమైన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస్, ఆర్ఐలు దామోదర్, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఎస్సైలు ఉపేందర్, సంతోష్‌తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రగ్బీలో జాతీయ స్థాయి పోటీలకు తొర్రూర్ విద్యార్థిని ఎంపిక..

- ఐశ్వర్యకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- జాతీయ స్థాయి పోటీలకు ఆర్థిక సాయం అందజేసిన అభిషేక్‌రెడ్డి

**ఆదిభట్ల అక్టోబర్ 26 మహా :** జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఐశ్వర్య, గ్రామానికి గర్వకారణంగా నిలిచారని, ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల సర్కిల్, తొర్రూర్‌కు చెందిన రాధ-కృష్ణ దంపతుల కుమార్తె ఐశ్వర్య రగ్బీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబర్చటం పట్ల, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచారని వారు కొనియాడారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న ఐశ్వర్య జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయిలోనూ తన ఆటతీరుతో ఆకట్టుకుని ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఐశ్వర్య సాధించిన విజయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సైతం విద్యార్థినిని ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా క్రీడా సామగ్రితో పాటు... ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించి తన ప్రోత్సాహాన్ని చాటుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఐశ్వర్య సత్తా చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కావాల్సిన ప్రోత్సాహం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అభిషేక్ తెలిపారు. ఐశ్వర్యకు లభించిన ప్రోత్సాహంపై ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

- రూ.27 లక్షలతో అదనపు తరగతి గదుల పునరుద్ధరణ.. రూ.25 లక్షలతో టాస్క్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. కళాశాలలో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టిన అదనపు తరగతి గదుల పునరుద్ధరణ పనులతో పాటు, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని, రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు పెంపొందించడం, స్వచ్ఛమైన తాగునీటిని అందించడం లక్ష్యంగా ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా కళాశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.



## నేడు ఇబ్రహీంపట్నం రానున్న ఎమ్మెల్యే..!

**బుగ్గరామలింగేశ్వర జాతర ఏర్పాట్లపై సమీక్ష**
**అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం**

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 మహా :** నేడు ఇబ్రహీంపట్నం కోర్టును సందర్శించి, న్యాయవిద్య పూర్తిచేసిన గ్రాడ్యుయేట్లను కలిసి, ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమంపై న్యాయవాదులతో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మంచాల మండలం, "ఆరుట్ల గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గరామలింగేశ్వర జాతర ఏర్పాట్లపై, ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగే సమీక్షా" సమావేశానికి ఎమ్మెల్యే హాజరవుతారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశంలో పాల్గొననున్నారు.




## పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్**

**పెద్దపల్లి మహా:** సుల్తానాబాద్: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచ్ పన్ అభియాన్‌లో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు బాలబాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 26 నుంచి 31 వరకు విద్యార్థులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, పాఠశాల ప్రిన్సిపాల్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆదర్శ కుటుంబం' విడుదలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ..
# మరోసారి వాయిదా పడనుందా?



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై మొదటి నుంచీ ఆసక్తి నెలకొంది. అయితే సినిమా విడుదల తేదీ పలుమార్లు మారడంతో అభిమానుల్లో కొంత గందరగోళం ఏర్పడింది. తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించిన చిత్రబృందం, ఆ తర్వాత అక్టోబర్ 9కు మార్చింది. సాంకేతిక పనులు, విడుదలకు సంబంధించిన ఏర్పాట్ల కారణంగా ఆ తేదీ కూడా వాయిదా పడింది. తాజాగా అక్టోబర్ 30న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నేపథ్యంలో సినిమా వాయిదాపై వస్తున్న వార్తలకు కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే విడుదల తేదీ మళ్లీ మారుతుందనే ప్రచారానికి సంబంధించి ఆమె చేసిన వ్యాఖ్యల పూర్తి వివరాలు స్పష్టంగా నిర్ధారించాల్సి ఉంది. నిర్మాత నాగవంశీ గతంలో సినిమా సాంకేతిక నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో మరికొంత సమయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీంతో చిత్రబృందం తుది రూపంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. వెంకటేశ్ ఈ సినిమాలో చిట్టిబాబు అనే కుటుంబ పెద్ద పాత్రలో కనిపించనుండగా, శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా దీపావళి పండుగకు ముందు విడుదల కానుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అక్టోబర్ 30 విడుదల తేదీగా ప్రకటించారు. మరో మార్పు ఉంటే చిత్రబృందం అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

## పాస్టల్ పింక్ డ్రెస్‌లో
# సందీపా ధర్..



తన అందం, స్టైలిష్ ఫ్యాషన్ ఎంపికలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న బాలీవుడ్ నటి సందీపా ధర్ మరోసారి తన ప్రత్యేకమైన లుక్‌తో వార్తల్లో నిలిచారు. పాస్టల్ పింక్ దుస్తుల్లో ఆమె కనిపించిన ఫొటోలు ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా పార్టీ దుస్తులంటే మెరిసే రంగులు, భారీ అలంకరణలు గుర్తుకొస్తాయి. అయితే సందీపా మాత్రం లేత గులాబీ రంగు దుస్తులతో సింపుల్‌గా, అదే సమయంలో స్టైలిష్‌గా కనిపిస్తూ ప్రత్యేకతను చాటుకున్నారు. పాస్టల్ రంగులకు ఉండే మృదువైన అందం, ఆధునిక డిజైన్ కలయిక ఆమె లుక్‌కు కొత్త ఆకర్షణను తీసుకొచ్చాయి. దుస్తులకు అనుగుణంగా ఎంచుకున్న మేకప్, హెయిర్ స్టైలింగ్ మొత్తం రూపాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఎక్కువ ఆభరణాలు లేకుండానే తన ఫ్యాషన్ ఎంపికతో ఆకట్టుకోవడం ఈ లుక్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. పార్టీలు, ప్రత్యేక వేడుకలకు భిన్నమైన దుస్తులు ఎంచుకోవాలనుకునేవారికి ఇలాంటి పాస్టల్ షేడ్స్ మంచి ఎంపికగా నిలుస్తాయి. సందీపా ధర్ సినిమాలతో పాటు డిజిటల్ వేదికలపైనా తన నటనతో గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఇసి లైఫ్ మేన్' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, 'హీరోపంతి', 'దబాంగ్ 2' వంటి సినిమాలతో ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం వెబ్ సిరీస్‌లు, ఇతర ప్రాజెక్టుల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను విస్తరించుకున్నారు. నటనతో పాటు ఫ్యాషన్ విషయంలోనూ విభిన్నమైన శైలిని ప్రదర్శించే సందీపా, సంప్రదాయ రూపాల నుంచి ఆధునిక పార్టీ దుస్తుల వరకు తన అభిరుచిని చాటుకుంటున్నారు. పాస్టల్ పింక్ లుక్‌తో మరోసారి ఫ్యాషన్ అభిమానులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు.

## రూ.1000 కోట్ల క్లబ్‌పై కోలీవుడ్ కన్ను..

భారతీయ చిత్ర పరిశ్రమలో భారీ బాక్సాఫీస్ వసూళ్లకు కేరాఫ్‌గా నిలుస్తున్న దక్షిణాది సినిమాల్లో తమిళ చిత్ర పరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉంది. రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి అగ్ర కథానాయకులతో పాటు శంకర్, అట్లీ, లోకేశ్ కనగరాజ్ వంటి దర్శకులు ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకునే తమిళ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి తొలి భాగం విజయంతో పాటు రజనీకాంత్ క్రేజ్ కూడా అదనపు బలంగా నిలిచాయి. అక్టోబర్ 25న వెలువడిన బాక్సాఫీస్ నివేదికల ప్రకారం, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.660 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాల్లో అగ్రస్థానాల కోసం పోటీ పడుతోంది. అయితే రూ.1000 కోట్ల క్లబ్‌లోకి చేరాలంటే ఇంకా గణనీయమైన వసూళ్లు సాధించాల్సి ఉంది.



మరోవైపు రజనీకాంత్, కమల్ హాసన్ కలిసి నటించనున్న కొత్త మల్టీస్టారర్‌పైనా సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. దాదాపు 47 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరు దిగ్గజ నటులు ఒకే సినిమాలో కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. తమిళ చిత్ర పరిశ్రమలో రూ.1000 కోట్ల వసూళ్లను అందుకోవడానికి స్టార్ హీరోల క్రేజ్ తో పాటు కథా బలం, ఇతర భాషల్లో ఆదరణ, విదేశీ మార్కెట్లలో విడుదల, టికెట్ ధరలు, థియేటర్ల సంఖ్య వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమలు ఇప్పటికే ఈ స్థాయి వసూళ్లను సాధించిన నేపథ్యంలో కోలీవుడ్ కూడా ఆ మైలురాయిని అందుకోవాలని చూస్తోంది. మరి 'జైలర్ 2' ఆ రికార్డుకు చేరువవుతుందా? లేక రజనీకాంత్ -కమల్ హాసన్ కలయికలో రానున్న చిత్రం చరిత్ర సృష్టిస్తుందా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

## కీర్తి సురేష్, రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు!



సినిమా పరిశ్రమలో కథానాయికలు ఎదుర్కొనే సమస్యలు, కెరీర్ ఆరంభంలో ఎదురయ్యే ఒత్తిళ్లపై ప్రముఖ నటీమణులు కీర్తి సురేష్, రాధికా ఆప్టే తాజాగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొందరు పురుష సహనటుల అభద్రతాభావం వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొన్నానని కీర్తి సురేష్ చెప్పగా, మహిళల మధ్యనే గొడవలు ఎక్కువగా ఉంటాయనే అభిప్రాయం పాతకాలపు ఆలోచన అని రాధికా ఆప్టే పేర్కొన్నారు. వీరిద్దరూ తమ తాజా వెబ్ సిరీస్ 'అక్క' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చిత్ర పరిశ్రమలో తమ అనుభవాలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో కొందరు సహనటుల ప్రవర్తన కారణంగా తనలోనే ఏదైనా తప్పు ఉందేమోనని అనుమానించిన సందర్భాలు ఉన్నాయని కీర్తి వెల్లడించారు. అయితే కాలక్రమంలో ఇతరుల ప్రవర్తనకు తనను తాను బాధ్యురాలిగా భావించకూడదని తెలుసుకున్నానని వివరించారు. నటీమణులు తమ ప్రతిభను నిరూపించుకునే క్రమంలో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం బాధాకరమని ఆమె అభిప్రాయపడ్డారు. మరోవైపు రాధికా ఆప్టే మాట్లాడుతూ, మహిళలు ఒకరితో ఒకరు పోటీపడుతూ గొడవపడతారనే భావన వాస్తవానికి దూరంగా ఉందన్నారు. పని ప్రదేశంలో వ్యక్తుల మధ్య సంబంధాలు వారి వ్యక్తిత్వం, పరస్పర అవగాహనపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. కొన్నిసార్లు పురుషుల్లోనే ఎక్కువ అభద్రతాభావం కనిపిస్తుందని తన అనుభవాన్ని పంచుకున్నారు. అయితే ప్రతి ఒక్కరినీ ఒకేలా చూడకూడదని, మహిళలకు మద్దతుగా నిలిచే పురుషులు కూడా చాలామంది ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. సినిమా సెట్లలో మహిళలు, పురుషులు పరస్పర గౌరవంతో పనిచేసే వాతావరణం ఉండాలని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కథానాయికలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయగలగడం, పాత్రలు మరియు పని పరిస్థితుల విషయంలో తమకు ఉన్న పరిమితులను స్పష్టంగా తెలియజేయగలగడం అవసరమనే చర్చకు ఈ వ్యాఖ్యలు దారితీశాయి. కీర్తి సురేష్, రాధికా ఆప్టే కలిసి నటిస్తున్న 'అక్క' క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 1980ల దక్షిణ భారతదేశంలోని కల్పిత ప్రాంతం పెర్నూరు నేపథ్యంలో సాగుతుంది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ సిరీస్ అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. మహిళా ప్రధాన పాత్రలతో రూపొందిన ఈ సిరీస్ ప్రచార సమయంలో ఇద్దరు నటీమణులు పంచుకున్న అనుభవాలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## జసం ఉట్టిపడే అందంతో
# మాళవిక మోహనన్



తన అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి మాళవిక మోహనన్ మరోసారి సంప్రదాయ వస్త్రధారణతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. క్రిమ్సన్ రంగు సంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించిన ఫొటోలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ఆధునిక ఫ్యాషన్ పోకడలను అనుసరిస్తూనే భారతీయ సంప్రదాయ వస్త్రధారణకు ప్రాధాన్యం ఇవ్వడంలో మాళవిక తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ఎరుపు రంగులోని ప్రత్యేకమైన ఆకర్షణకు, సంప్రదాయ డిజైన్ జత కావడంతో ఆమె లుక్ మరింత అందంగా కనిపిస్తోంది. దుస్తులకు అనుగుణంగా ఎంచుకున్న ఆభరణాలు, చక్కటి మేకప్, అందమైన హెయిర్ స్టైల్ ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సాధారణంగా సంప్రదాయ దుస్తులు ధరించినప్పుడు ఆభరణాల ఎంపిక కూడా ఎంతో ముఖ్యమవుతుంది. దుస్తుల రంగుకు సరిపోయే ఆభరణాలను ఎంచుకోవడం ద్వారా మొత్తం లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చుకోవచ్చని మాళవిక స్టైల్ సూచిస్తోంది. ముఖ్యంగా పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక వేడుకల్లో సంప్రదాయంగా కనిపించాలనుకునేవారికి ఇలాంటి దుస్తుల ఎంపిక మంచి ఫ్యాషన్ ప్రేరణగా నిలుస్తుంది. మాళవిక మోహనన్ మలయాళ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టి, ఆ తర్వాత తమిళం, హిందీ చిత్రాల్లోనూ నటించారు. 'పెట్టా', 'మాస్టర్', 'క్రిస్టీ', 'తంగలాన్' వంటి సినిమాలతో విభిన్న పాత్రల్లో తన ప్రతిభను చాటుకున్నారు. నటనతో పాటు ఫొటోషూట్లు, ఫ్యాషన్ ఎంపికలతోనూ ఆమె అభిమానులను ఆకట్టుకుంటున్నారు. సంప్రదాయ దుస్తుల్లో కనిపించినా, ఆధునిక దుస్తుల్లో మెరిసినా తనదైన శైలిని ప్రదర్శించడం మాళవిక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. తాజాగా క్రిమ్సన్ రంగు సంప్రదాయ లుక్‌తో మరోసారి ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com